



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 285 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల బుధవారం 17 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 285 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA WED 17 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఏపీలో అద్భుత అవకాశాలు..
# పెట్టుబడులు పెట్టండి




- సింగపూర్ సమ్మిట్‌లో అమరావతి బ్రాండింగ్.. చంద్రబాబు కీలక ప్రసంగం
- సింగపూర్‌లో వరల్డ్ సిటీస్ సమ్మిట్‌లో ప్రసంగించిన సీఎం చంద్రబాబు
- సరికొత్త ఆలోచనలతో అమరావతికి రావాలని పెట్టుబడిదారులకు ఆహ్వానం
- అభివృద్ధికి, సంపద సృష్టికి సైబరాబాద్ నిదర్శనమని వ్యాఖ్య
- ప్రజా రాజధానిగా అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని వెల్లడి
- సింగపూర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ ప్రదర్శన స్టాళ్లను సందర్శించిన ముఖ్యమంత్రి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అవకాశాల గనిగా అభివర్ణించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సరికొత్త ఆలోచనలతో పెట్టుబ డులు పెట్టేందుకు ముందుకు రావాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. సింగపూర్‌లో జరుగుతున్న 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో భాగంగా తన పర్యటన రెండో రోజు ఆయన 'కెన్ స్మార్ట్ సిటీస్ లవ్ హ్యూమన్స్' అనే అంశంపై ప్లీనరీలో ప్రసంగించారు. అమరావతిని ఒక ప్రజా రాజధానిగా, ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు.అమరావతిని కేవలం పరిపాలనా నగరంగా కాకుండా, ఒక నాలెడ్జ్ సిటీగా తీర్చిదిద్దుతున్నామని, ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలు వస్తున్నాయని

- మిగతా 2లో



### ఏపీ పీఈసెట్ ఫలితాలు విడుదల
## చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

- ఏపీ పీఈసెట్-2026 ఫలితాలను విడుదల చేసిన మంత్రి లోకేశ్
- ఈ ఏడాది మొత్తంగా 89.76 శాతం ఉత్తీర్ణత నమోదు
- మొత్తం 2,958 మంది పరీక్ష రాయగా 2,655 మంది అర్హత
- పురుషుల్లో 92.91 శాతం, మహిళల్లో 81.43 శాతం మంది ఉత్తీర్ణులు
- వెబ్‌సైట్, వాట్సాప్ ద్వారా ఫలితాలు తెలుసుకునే అవకాశం

- మిగతా 2లో



## 'దిశ' ఫెయిల్.. 'శక్తి' సక్సెస్

- ఏపీలో క్రైం రేటు 14.1 శాతం తగ్గిందన్న అనిత
- గత ప్రభుత్వ హయాంలో దిశ చట్టం అమలు కాలేదని విమర్శ
- ఇప్పటి వరకు 2,366 గంజాయి కేసులు నమోదు చేశామని వెల్లడి

- మిగతా 2లో

## కేంద్ర జలశక్తి మంత్రితో పవన్ భేటీ.. 'సూరత్ నమూనా'పై కీలక చర్చ!

- సీఆర్ పాటిల్ తో పవన్ కల్యాణ్ భేటీ
- రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో నీటి కొరత తీరలేదని చెప్పిన పవన్
- నదీ జలాల స్వచ్ఛతపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచన

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్నారు. ఆయన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలోని తాగునీటి ఎద్దడి, కలుషితమవుతున్న



- మిగతా 2లో

### నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై
# తాత్కాలిక నిషేధం

- భారత్‌లో యాప్‌పై ఆంక్షలు.. స్పందించిన టెలిగ్రామ్ సీఈఓ
- చీటింగ్, తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకే ఈ నిర్ణయం
- జూన్ 21న దేశవ్యాప్తంగా నీట్-యూజీ పునఃపరీక్ష
- కేంద్రం చర్యను తప్పుబట్టిన టెలిగ్రామ్ సీఈవో పావెల్ దురోవ్
- ప్లే స్టోర్ నుంచి టెలిగ్రామ్ యాప్‌ను తొలగించిన గూగుల్

పెన్ పవర్ డెస్క్:నీట్-యూజీ 2026 పునఃపరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై దేశవ్యాప్తంగా జూన్ 22 వరకు తాత్కాలిక ఆంక్షలు విధించింది. పరీక్ష సమయంలో చోటుచేసుకునే అక్రమాలను, తప్పుడు ప్రచారాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సిఫార్సు మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 69ఏ కింద ఈ ఆదేశాలు జారీ అయ్యాయి.కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై

- మిగతా 2లో





## జులై మూడో వారంలో 'తల్లికి వందనం'.. విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష

పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి, విద్యార్థులకు నాణ్యమైన భవిష్యత్తును అందించే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు

- మిగతా 2లో

## ఫీజుల దోపిడీ... భగ్గుమన్న ఏబీవీపీ.. హైదరాబాద్‌లో ఉద్రిక్తత, పలువురి అరెస్ట్

- ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ కోరుతూ ఏబీవీపీ ఆందోళన
- హైదరాబాద్ లో పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ వద్ద ఉద్రిక్తత
- ఫీజుల నియంత్రణకు వెంటనే చట్టం తేవాలని డిమాండ్
- ప్రభుత్వ హామీలున్నా ఫీజుల పెంపుతో ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు
- నిరసనకు దిగిన పలువురు ఏబీవీపీ కార్యకర్తలను అరెస్ట్ చేసిన పోలీసులు




పెన్ పవర్ డెస్క్:ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా పెంచుతున్న ఫీజులను అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మంగళవారం హైదరాబాద్‌లో చేపట్టిన

- మిగతా 2లో

## ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు.. కరచాలనం చేసుకున్న మోదీ, ట్రంప్




- ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సుకు ప్రధాని మోదీ హాజరు
- హర్మూజ్ గుండా చమురు సరఫరా సులభతరమైందన్న ట్రంప్
- రష్యా చమురుపై త్వరలో మళ్లీ ఆంక్షలు విధిస్తామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఫ్రాన్స్‌లోని ఇవియాన్‌లో జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. మంగళవారం నిర్వహించిన కీలకమైన 'ఔట్‌రీచ్ సెషన్'లో భాగంగా ఆయన ప్రపంచ నేతలతో కలిసి

- మిగతా 2లో

## దక్షిణ కోస్తాంధ్ర వరకు విస్తరించిన ద్రోణి

పెన్ పవర్ డెస్క్:విశాఖపట్నం(ఏయూ ప్రాంగణం): తూర్పు విదర్భ, తెలంగాణ మీదుగా దక్షిణ కోస్తాంధ్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. 'బుధవారం విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, ఏలూరు,

- మిగతా 2లో





## కాంగ్రెస్ వైఖరిపై బండి సంజయ్ నిప్పులు..
### తెలంగాణకు రూ. 10 లక్షల కోట్లు కేటాయించామని వెల్లడి

- తెలంగాణ ప్రగతికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్న బండి సంజయ్
- అక్రమ వలసదారుల ఓట్లపై కాంగ్రెస్ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్న
- తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే ప్రసక్తే లేదని, ప్రధా ని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తెలంగాణ ప్రగతికి ఎల్లప్పుడూ

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# టీడీపీ, జనసేనల మధ్య గ్యాప్ పెరిగిందా?

ఆంధ్రప్రదేశ్ లో కూటమి పార్టీల మధ్య సఖ్యత లేదన్నది స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యంగా ప్రభుత్వంపై విపక్ష వైసీపీ చేస్తున్న ఆరోపణలకు టీడీపీ మాత్రమే సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది. కానీ కూటమిలో ప్రధాన మిత్ర పక్షంగా ఉన్న జనసేన మాత్రం అస్సలు విపక్షాల విమర్శలకు కనీసం సమాధానం చెప్పడం లేదు. కౌంటర్ ఇవ్వడం లేదు. ఈ పరిణామాలు కింది స్థాయి కార్యకర్తలకు తప్పుడు సంకేతాలు వెళుతున్నాయి. అసలు కూటమి పార్టీల్లో సమన్వయం ఉందా? లేదా? అన్న అనుమానం పార్టీ నేతలు, కార్యకర్తల్లో మొదలయింది. ఇందుకు కారణాలు ఏంటనేది బయటకు తెలియకపోయినా జనసేన మౌనంగా ఉండటం ఎన్నో సందేహాలకు తావిస్తుంది.

**మెగా డీఎస్సీపై వైసీపీ...**

గత కొంతకాలంగా వైసీపీ మెగా డీఎస్సీ పై తీవ్ర ఆరోపణలు చేస్తుంది. మెగా డీఎస్సీలో భారీగా అవకతవకలు జరిగాయని వైసీపీ ఆరోపిస్తుంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నుంచి కింది స్థాయి నేతల వరకూ మీడియా సమావేశాల్లోనూ, సోషల్ మీడియాలోనూ మెగా డీఎస్సీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తుంది. మెగా డీఎస్సీ కింద 16వేల ఉద్యోగాలను కూటమి ప్రభుత్వం భర్తీ చేసింది. ఉద్యోగాలు వచ్చిన ప్రతి ఒక్కరికీ పెద్ద పండగలా చేస్తూ అందరికీ టీడీపీ నేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ చీఫ్ మాధవ్ లు కలసి నియామక పత్రాలను అందచేశారు. విద్యాశాఖకు మంత్రి నారా లోకేశ్ పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో కనీసం డీఎస్సీపై వైసీపీ చేసిన ఆరోపణలపై జనసేన స్పందించకపోవడం చర్చనీయాంశమైంది.

**మంత్రివర్గంలో కలసి ఉన్నా...**

మంత్రివర్గంలో జనసేన కలసి ఉంది. ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణలకు కలసి కట్టుగా సమాధానం చెప్పాల్సి ఉన్న సమయంలో జనసేన మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. అందులోనూ లోకేశ్ నేతృత్వం వహిస్తున్న శాఖలో అవినీతి ఆరోపణలు వస్తే కూటమి మిత్ర పక్షాలన్నీ కలసి వాటిపై వివరణ ఇవ్వాల్సి ఉండగా కేవలం టీడీపీ నేతలు మాత్రమే దీనిపై వివరణలు ఇస్తున్నారు. అలాగే వైసీపీ ఆరోపణలను ఖండిస్తున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకూ మెగా డీఎస్సీపై వైసీపీ చేసిన ఆరోపణలకు ఏ మాత్రం స్పందించకపోవడంతో ఎందుకిలా జరుగుతుందన్న అనుమానాలు బయలుదేరాయి. మొత్తం మీద జనసేన వ్యవహారం టీడీపీ లోని కొందరి నేతలకు మింగుడు పడటం లేదు.

## జులై మూడో వారంలో 'తల్లికి వందనం'.. విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష

- మొదటి పేజి తరువాయి

పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయం అందించే 'తల్లికి వందనం' పథకాన్ని జులై మూడో వారంలో అమలు చేసేందుకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. దీంతో పాటు, పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు.

ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల, ఉన్నత విద్యాశాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. 'తల్లికి వందనం' పథకం అమలుపై ప్రధానంగా చర్చించారు. తల్లుల ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ దాదాపుగా పూర్తయిందని, జులై మూడో వారంలో పథకాన్ని అమలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని లోకేశ్ స్పష్టం చేశారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు జూన్ 29న 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం, తల్లిదండ్రులను భాగస్వాములను చేసేందుకు జులై మూడో వారంలో 'మెగా పీటీఎం' నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపైనా చర్చించారు.పాఠశాల విద్యపై సమీక్ష అనంతరం, ఉన్నత విద్యారంగంపై మంత్రి లోకేశ్ దృష్టి సారించారు. రాష్ట్రంలో నిర్వహించే ఎప్‌సెట్, పాలిసెట్, ఆర్‌సెట్ వంటి 12 రకాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సెట్)ల నిర్వహణలో ఎలాంటి జాప్యం జరగకూడదని గట్టిగా ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా నోటిఫికేషన్లు విడుదల చేసి, నిర్ణీత గడువులోగా అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. జాతీయ స్థాయి పరీక్షలు, పొరుగు రాష్ట్రాల సెట్ల తేదీలను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా షెడ్యూల్ ఖరారు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 1.88 లక్షల ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి ఎప్‌సెట్ నోటిఫికేషన్ సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల పెంపును పరిశీలించాలని, ముఖ్యంగా డిమాండ్ ఉన్న మెకానికల్, సివిల్ బ్రాంచ్ లపై దృష్టి పెట్టాలని సూచించారు.రాష్ట్రానికి ప్రపంచస్థాయి విద్యాసంస్థలను తీసుకురావడం ద్వారా ఉన్నత విద్యా ప్రమాణాలను పెంచాలని మంత్రి ఆకాంక్షించారు. థాపర్ ఇనిస్టిట్యూట్, జేమ్స్ కుక్ యూనివర్సిటీ, మెల్ బోర్న్ యూనివర్సిటీ వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు చూపుతున్న ఆసక్తిపై చర్చించారు. ముఖ్యంగా, జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని లోకేష్ ఆదేశించారు.

ఇదే సమయంలో, రాష్ట్రంలో ఎన్‌సీసీ కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు ప్రత్యేక 'ఎన్‌సీసీ స్టేట్ డైరెక్టరేట్'ను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయంతో ఏపీ యువతకు సైనిక శిక్షణలో మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జె. శ్యామలరావు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, ఉన్నతవిద్యా కమిషనర్ నారాయణ్ భరత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో అద్భుత అవకాశాలు.. పెట్టుబడులు పెట్టండి

- మొదటి పేజి తరువాయి

చంద్రబాబు వివరించారు. క్రీడలు, ఆర్థిక, విజ్ఞానం, న్యాయ, పర్యాటక, ఆరోగ్యం, మీడియా వంటి థీమ్ లతో అమరావతిని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ హబ్, డిజిటల్ మౌలిక వసతులు దీనికి ప్రత్యేకతను తెస్తాయని పేర్కొన్నారు. 21 కిలోమీటర్ల కృష్ణా నది తీరం వెంబడి వాటర్ ఫ్రంట్ సిటీగా, ఇన్నర్-ఔటర్ రింగ్ రోడ్లు, ఐకానిక్ వంతెనలతో అమరావతి అద్భుతంగా రూపుదిద్దుకోనుందని అన్నారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లు, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, భూగర్భ యుటిలిటీస్, గ్రీన్ ఎనర్జీ, నెట్ జీరో ఉద్గారాల లక్ష్యంగా రాజధాని నిర్మాణం జరుగుతోందని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా, తమ పిలుపు మేరకు రైతులు 35 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా రాజధాని కోసం ఇచ్చారని, ఆ భూమిని అభివృద్ధి చేసి రైతులకు ప్లాట్ల రూపంలో తిరిగి ఇచ్చే ల్యాండ్ పూలింగ్ మోడల్‌ను ఆయన సదస్సులో వివరించారు. అభివృద్ధి ద్వారానే సంపద సృష్టి సాధ్యమని చెప్పేందుకు తాను గతంలో నిర్మించిన సైబరాబాద్‌ను చంద్రబాబు ఉదాహరణగా చూపారు. "25 ఏళ్ల క్రితం నేను ఐటీ గురించి మాట్లాడాను. భవిష్యత్తును ముందుగానే ఊహించి 'ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్' తీసుకున్నాం. దాని ఫలితంగానే నేడు తెలుగువారు తలసరి ఆదాయంలో ముందున్నారు. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) గురించి ఆలోచిస్తున్నాం," అని ఆయన అన్నారు. నాడు తాను నిర్మించిన సైబరాబాద్ నేడు తెలంగాణకు ప్రధాన ఆదాయ వనరుగా మారిందని, ఒకప్పుడు ఎకరం రూ.2 లక్షలు ఉన్న భూమి ఇప్పుడు రూ.200 కోట్లకు పెరిగిందని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత మరోసారి కొత్త నగరాన్ని నిర్మించే అవకాశం తనకు దక్కిందని పేర్కొన్నారు.

ప్రసంగం అనంతరం, సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సింగపూర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ ప్రదర్శన స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించారు. సింగపూర్ పెవిలియన్‌లోని అత్యాధునిక పట్టణాభివృద్ధి నమూనాలను, 'ఇన్నోవేటర్స్ అలే'లో స్టార్టప్‌ల ఆవిష్కరణలను, గూగుల్ స్టాల్‌ను ఆసక్తిగా పరిశీలించారు. టెక్నాలజీ ఆధారిత పాలనలో సింగపూర్ అనుభవాలను అడిగి తెలుసుకున్నారు.

## 'దిశ' ఫెయిల్.. 'శక్తి' సక్సెస్

ఏ రాష్ట్రానికైనా పెట్టుబడులు, పరిశ్రమలు రావాలంటే అక్కడ శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉండాలని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఈరోజు నిర్వహించిన మీడియా సమావేశంలో కూటమి ప్రభుత్వ పోలీసింగ్ తీరుపై ఆమె పూర్తి స్థాయి రిపోర్ట్ కార్డ్‌ను బయటపెట్టారు. గత ప్రభుత్వ హయాంలో 'దిశ' చట్టం అమలు కాలేదని విమర్శిస్తూ.. తమ హయాంలో క్రైం రేట్ గణనీయంగా తగ్గిందని లెక్కలతో సహా వివరించారు. ఏపీలో క్రైం రేటు 14.1 శాతం తగ్గిందని హోంమంత్రి వెల్లడించారు. సీసీటీవీలు, డ్రోన్ టెక్నాలజీ వాడకం వల్లే ఇది సాధ్యమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాల టార్గెట్ పెట్టుకోగా, ఇప్పటికే 70 శాతం పూర్తి చేశామని, నేరం జరిగిన 24 గంటల్లోనే నిందితులను పట్టుకుంటున్నామని చెప్పారు. మహిళలపై నేరాల్లో 6.9 శాతం తగ్గుదల నమోదైందని తెలిపారు. తాము ఐజీ స్థాయి అధికారితో 'శక్తి యాప్' తెచ్చామని, దీనిని 1.5 కోట్ల మంది డౌన్లోడ్ చేసుకున్నారని తెలిపారు. లైంగిక నేరాల దర్యాప్తు నాణ్యత 31 శాతం నుంచి ఏకంగా 90 శాతానికి పెరిగిందని, 591 మందికి శిక్షలు పడ్డాయని వివరించారు. 'ఈగల్ టీమ్' ద్వారా నార్కోటిక్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని, ఏపీ మోడల్‌ను తెలంగాణ కూడా అనుసరిస్తుండడం మనకు గర్వకారణమన్నారు. ఇప్పటివరకు 2,366 గంజాయి కేసులు నమోదు చేసి, 986 మందిని అరెస్ట్ చేశామన్నారు. అలాగే సైబర్ క్రైమ్స్ కోసం ప్రత్యేక 'వార్ రూమ్' ఏర్పాటు చేస్తున్నామని, రూ. 247 కోట్ల సైబర్ ఫ్రాడ్ మనీని ఫ్రీజ్ చేయడంతో పాటు 8 వేలకు పైగా ఇల్లీగల్ ఆన్‌లైన్ కంటెంట్‌ను తొలగించామని స్పష్టం చేశారు.

## ఏపీ పీఈసెట్ ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

ఆంధ్రప్రదేశ్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ పీఈసెట్-2026) ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ ఫలితాలను మంగళవారం ప్రకటించారు. ఈ ఏడాది పీఈసెట్‌లో మొత్తం 89.76 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఆయన తెలిపారు.ఫలితాల వివరాల్లోకి వెళితే, పీఈసెట్-2026 కోసం మొత్తం 4,037 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 2,958 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 2,655 మంది అర్హత సాధించారు. అర్హత సాధించిన వారిలో పురుషులు అధికంగా ఉన్నారు. పరీక్షకు హాజరైన పురుషుల్లో 92.91 శాతం (1,993 మంది) ఉత్తీర్ణులు కాగా, మహిళల్లో 81.43 శాతం (662 మంది) ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు వెల్లడించారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, ఫిజికల్ ఎడ్యుకేషన్, క్రీడల రంగంలో కెరీర్‌ను ఎంచుకునే దిశగా ముందడుగు వేసిన అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. వారి భవిష్యత్ ప్రయత్నాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.అభ్యర్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ cets.apsche.ap.gov.in/PECET/ లో చూసుకోవచ్చు. ర్యాంక్ కార్డులను కూడా ఇదే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదనంగా, 'మన మిత్ర' వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా కూడా ఫలితాలను తెలుసుకునే సౌకర్యాన్ని కల్పించారు.

## ఫీజుల దోపిడీ... భగ్గుమన్న ఏబీవీపీ.. హైదరాబాద్‌లో ఉద్రిక్తత, పలువురి అరెస్ట్

- మొదటి పేజి తరువాయి

ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ కార్యాలయం ముట్టడికి యత్నించిన పలువురు ఏబీవీపీ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.వివరాల్లోకి వెళితే, ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బి. రాజ్ నేతృత్వంలో విద్యార్థి సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సైఫాబాద్‌లోని కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు.

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని నియంత్రించేందుకు తక్షణమే 'ఫీజుల నియంత్రణ చట్టం' తీసుకురావాలని ఏబీవీపీ చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాలు, హామీలు ఉన్నప్పటికీ, 2026-27 విద్యా సంవత్సరానికి హైదరాబాద్‌లోని అనేక పాఠశాలలు 20 నుంచి 50 శాతం వరకు ఫీజులు పెంచేశాయని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. దీనికి తోడు పుస్తకాలు, యూనిఫామ్‌ల పేరుతో వేల రూపాయలు అదనంగా వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వారు మండిపడ్డారు.

ఈ ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫీజుల నియంత్రణకు కఠిన నిబంధనలు రూపొందించాలని అధికారులను ఆదేశించినప్పటికీ, ఇంతవరకు సమగ్ర చట్టం కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వ జాప్యాన్ని ఆసరాగా చేసుకుని యాజమాన్యాలు ఫీజుల భారం మోపుతున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పటిష్ఠమైన చట్టాన్ని అమలు చేయాలని తల్లిదండ్రుల సంఘాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## కేంద్ర జలశక్తి మంత్రితో పవన్ భేటీ.. 'సూరత్ నమూనా'పై కీలక చర్చ!

- మొదటి పేజి తరువాయి

నదుల పరిరక్షణ, జల్ జీవన్ మిషన్ అమలు వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో ఇంకా నీటి కొరత తీరలేదని పవన్ కల్యాణ్ కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు స్థిరమైన తాగునీటి సరఫరా అందించడానికి గుజరాత్‌లోని 'సూరత్ నమూనా'ను అధ్యయనం చేయాలని అధికారులకు పవన్ సూచించారు. సూరత్‌లో పారిశ్రామిక వ్యర్థ జలాలను శుద్ధి చేసి మళ్లీ ఎలా విజయవంతంగా వినియోగిస్తున్నారో, అదే విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని అన్నారు.

గోదావరి పుష్కరాలు సమీపిస్తున్న నేపథ్యంలో నదీ జలాల స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పవన్ స్పష్టం చేశారు. పారిశ్రామిక కాలుష్యం వల్ల ఏపీలోని నదులు, జలవనరులు దారుణంగా దెబ్బతింటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమలు వదిలే వ్యర్థాల వల్ల నదులు కలుషితం కాకుండా 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్' విధానాన్ని కఠినంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

## దక్షిణ కోస్తాంధ్ర వరకు విస్తరించిన ద్రోణి

- మొదటి పేజి తరువాయి

కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయి. మరోవైపు ఎండ ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గుండె సంబంధిత వ్యాధులు, మధుమేహం, రక్తపోటు ఉన్నవారు ఎండలో తిరగరాదు' అని సూచించింది.

## నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం

- మొదటి పేజి తరువాయి

టెలిగ్రామ్ సీఈఓ పావెల్ దురోవ్ స్పందించారు. కొందరు చేసే తప్పులకు భారత్‌లోని 150 మిలియన్ల మంది సాధారణ వినియోగదారులను శిక్షించడం సమంజసం కాదని ఆయన 'ఎక్స్' వేదికగా విమర్శించారు. ఈ నిషేధం వల్ల ఆశించిన ప్రయోజనం ఉండదని, లీకేజీలకు పాల్పడేవారు ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు.కాగా, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గూగుల్ ఇప్పటికే తన ప్లే స్టోర్ నుంచి టెలిగ్రామ్‌ను తొలగించగా, యాపిల్ కూడా త్వరలోనే ఈ దిశగా చర్యలు తీసుకోనుంది.నీట్ పునఃపరీక్ష నేపథ్యంలో కొందరు కేటుగాళ్లు టెలిగ్రామ్ ఛానెళ్ల వేదికగా నకిలీ ప్రశ్నపత్రాలు విక్రయిస్తామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పాత మెసేజ్‌లను ఎడిట్ చేస్తూ ప్రశ్నాపత్రాలు లీకైనట్లు నకిలీ ఆధారాలను సృష్టిస్తూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారు. ఈ తరహా మోసాలకు అడ్డుకట్ట వేసేందుకే ప్రభుత్వం ఈ యాప్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించింది. అంతేకాకుండా, జూన్ 30 వరకు టెలిగ్రామ్‌లో మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను కూడా నిలిపివేశారు.

## ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు.. కరచాలనం చేసుకున్న మోదీ, ట్రంప్

- మొదటి పేజి తరువాయి

వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పరం కరచాలనం చేసుకుని, ప్రత్యేకంగా చర్చించుకోవడం విశేషం.ఈ సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, రష్యా చమురుపై త్వరలోనే అమెరికా మళ్లీ ఆంక్షలు విధించే అవకాశం ఉందని సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఇటీవలే కుదిరిన ఒప్పందం కారణంగా హర్మూజ్ జలసంధి గుండా చమురు సరఫరా సులభతరమైందని, ఇది రష్యాపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలు కల్పిస్తుందని ఆయన వివరించారు. ఉక్రెయిన్‌పై దాడి నేపథ్యంలో మాస్కోపై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచేందుకు జీ7 దేశాలు కొత్త మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.సాధారణంగా జీ7 సభ్య దేశాలు, తాము ఆహ్వానించిన ఇతర దేశాల అధినేతలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో కలిసి ఈ ఔట్‌రీచ్ సెషన్‌ను నిర్వహిస్తాయి. ప్రపంచం ఎదుర్కొంటున్న కీలక ఆర్థిక, రాజకీయ సవాళ్లపై విస్తృతంగా చర్చించి, సరైన పరిష్కార మార్గాలను కనుగొనడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం.

## కాంగ్రెస్ వైఖరిపై బండి సంజయ్ నిప్పులు.. తెలంగాణకు రూ. 10 లక్షల కోట్లు కేటాయించామని వెల్లడి

- మొదటి పేజి తరువాయి

కట్టుబడి ఉంటుందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా మానకొండూరులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.దేశంలోకి అక్రమంగా చొరబడిన వలసదారుల గురించి కాంగ్రెస్ ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. అక్రమ వలసదారులతో ఇక్కడి ముస్లిం సమాజాన్ని పోల్చడం ద్వారా కాంగ్రెస్ వారిని అవమానిస్తోందని, తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.గత పన్నెండేళ్లలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్రం ఏకంగా రూ. 10 లక్షల కోట్లు కేటాయించిందని వెల్లడించారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల అభివృద్ధికి వేల కోట్లు ఇచ్చామన్నారు. రాష్ట్రం వేగంగా దూసుకుపోవాలంటే 'డబుల్ ఇంజన్ సర్కార్' రావాలని, ఈసారి ఒక్క అవకాశం బీజేపీకి ఇవ్వాలని ప్రజలను కోరారు.మావోయిస్టుల గురించి మాట్లాడుతూ... సమాజంలో తుపాకీ సంస్కృతి, మారణహోమంతో సాధించేది ఏమీ లేదన్నారు. ఏమీ తెలియని మైనర్ పిల్లల చేత తుపాకులు పట్టించడం అత్యంత దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలామంది మావోలు లొంగిపోయారని, ఇంకా ఆ ఆలోచనల్లో ఉన్నవారు భవిష్యత్తు కోసం మారాలని పిలుపునిచ్చారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ






విజయవాడ, పెన్ పవర్, జూన్, 16, కలెక్టర్ లక్ష్మీశ సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో వివిధ ఉద్యోగ సంఘాల నేతలతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను, అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు 92 అంశాలను ప్రస్తావించారు. ప్రధానంగా ఏఎన్ఎం (గ్రేడ్-3)లపై పని ఒత్తిడి, అన్ని శాఖల్లో నాలుగో తరగతి ఉద్యోగ ఖాళీల భర్తీ, ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్ఎస్ పటిష్ట అమలు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్‌లో జాప్యం, అర్హులైన వారికి కారుణ్య నియామకాలు, సరైన విచారణ లేకుండా క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం, జిల్లాస్థాయిలో క్రీడల నిర్వహణ, బస్సు డిపోల్లో మహిళా ఉద్యోగులకు సౌకర్యాల కల్పన తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ అనేది ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య సామరస్యపూర్వకమైన సంబంధాలను పెంపొందించడానికి, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ఏర్పాటైన ఒక అధికారిక వేదికని.. ఉద్యోగుల సమస్యలపై చర్చించి పరిష్కారాలను కనుగొనడానికి ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జిల్లా స్థాయిలో పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, మిగిలిన అంశాలను సమావేశ మినిట్స్ రూపంలో రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్వో లక్ష్మీనరసింహంతో పాటు ఏపీ ఎన్‌జీజీవోస్ అసోసియేషన్, స్టేట్ టీచర్స్ యూనియన్, ఏపీ ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్, ఏపీ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్, ఏపీ టీచర్స్ ఫెడరేషన్-1938, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఏపీ గవర్నమెంట్ వెహికల్స్ డ్రైవర్స్ సెంట్రల్ అసోసియేషన్, ఆల్ ఏపీ గవర్నమెంట్ క్లాస్ - 4 ఎంప్లాయీస్ సెంట్రల్ అసోసియేషన్, ఏపీ కోపరేటివ్ సర్వీస్ అసోసియేషన్, ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్, ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యునిటీ అసోసియేషన్, ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

# జిల్లాలో ప్రారంభమైన ఇంటింటి సర్వే ప్రక్రియ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





విజయవాడ, పెన్ పవర్, జూన్, 16, ఎన్నికల వ్యవస్థ పరిఢవిల్లేందుకు దోషరహిత ఓటర్ల జాబితా కీలకమని.. ఇందుకు నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ప్రజలు కీలకభాగస్వాములై, కార్యక్రమం విజయవంతానికి కృషిచేయాలని, జిల్లా వ్యాప్తంగా సోమవారం బీఎల్‌వోల ఇంటింటి సందర్శన కీలక దశ ప్రారంభమైందని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటింటి సర్వేలో భాగంగా జులై 14వ తేదీ వరకు బీఎల్‌వోలు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు (ఈఎఫ్‌లు) అందిస్తారని.. నింపిన వాటిని తిరిగి సేకరిస్తారని, ఇందుకు ప్రతి ఇంటికీ కనీసం మూడుసార్లు వెళ్లనున్నారని తెలిపారు. ఈ ప్రక్రియ ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా సజావుగా జరిగేందుకు అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతోనూ సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1,792 మంది బీఎల్‌వోలు ఉన్నారని.. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారం నింపి తిరిగి ఇవ్వాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారం నింపడంలో ఓటర్లకు బీఎల్‌వోలు సహకరిస్తారన్నారు. ఇంటింటి సర్వే ముగిసిన అనంతరం జులై 21న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం జులై 21 నుంచి ఆగస్టు 20 వరకు క్లెయిమ్‌లు, అబ్జెక్షన్ల స్వీకరణ ఉంటుందని.. ఆ తర్వాత వీటిని పరిష్కరించి ఈ ఏడాది సెప్టెంబర్ 22న తుది జాబితాను ప్రచురించడం జరుగుతుందన్నారు. అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని.. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. అర్హులను ఓటరు జాబితాలో ఉండేలా చేయడంతోపాటు అనర్హులు, మృతులు, శాశ్వతంగా వలసవెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం వంటి వారి ఓట్లను తొలగించి స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా లక్ష్యంగా చేపట్టిన ఈ సర్ ప్రక్రియలో ప్రజలు చైతన్యవంతంగా కార్యక్రమంలో పాల్గొని బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు..

# మహిళల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదికగా మహిళా గ్రీవెన్స్ ఎమ్మెల్యే గళ్ళా మాధవి




గుంటూరు, పెన్ పవర్, జూన్, 16, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మహిళా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మహిళల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ..మహిళలు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునేందుకు ప్రత్యేక వేదికగా మహిళా గ్రీవెన్స్‌ను నిరంతరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళల నుంచి ప్రధానంగా గృహ హింస, వేధింపులు, విద్య, ఉపాధి, ఆరోగ్యం, స్థానిక అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలు వస్తున్నాయని చెప్పారు. ఇప్పటివరకు వచ్చిన సమస్యల్లో దాదాపు 80 శాతం సమస్యలకు పరిష్కారం అందించామని, ప్రతి వారం వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా ప్రత్యేక బృందం పనిచేస్తోందని తెలిపారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో వికాస్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తోందని, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో అభివృద్ధి, ఉపాధి, విద్య, ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో గత రెండేళ్లలో రహదారులు, పారిశుధ్యం, డ్రైనేజీ, స్ట్రీట్ లైటింగ్, ఆరోగ్య సదుపాయాలు, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. సుమారు 1,500 మందికి జాబ్ మేళాల ద్వారా ఉద్యోగాలు కల్పించామని, రూ.500 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. మహిళా గ్రీవెన్స్, కార్యకర్తల గ్రీవెన్స్, ప్రజా గ్రీవెన్స్, ఫీల్డ్ విజిట్ల ద్వారా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా



విజయవాడ, పెన్ పవర్, జూన్, 16, ఐఏఎస్ సమక్షంలో దళిత్ ఫిలాంత్రఫీ ఫౌండేషన్ (డీపీఫ్ ) మరియు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ర్ టి ఐ హెచ్), విజయవాడ మధ్య అవగాహన ఒప్పందం (ఎం ఓ యూ ) కుదిరింది. ఈ ఒప్పంద పత్రాలను దళిత్ ఫిలాంత్రఫీ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ సంతోష్ కుమార్ సామల్ మరియు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓ జి. కృష్ణన్ పరస్పరం మార్చుకున్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తల ప్రోత్సాహం, సమగ్ర ఆవిష్కరణలు (ఇంక్లూసివే ఇన్నోవాషన్ ), జీవనోపాధి అభివృద్ధి (లివలిహుడ్ డెవలప్మెంట్ ), సామాజిక సంస్థల (సోషల్ ఎంటర్ప్రైసెస్ ) బలోపేతం కోసం సంయుక్తంగా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా మహిళలు, యువత మరియు వెనుకబడిన వర్గాల ఆర్థిక సాధికారతకు, స్వయం ఉపాధి అవకాశాల పెంపుకు, నైపుణ్యాభివృద్ధికి మరియు సామాజిక ప్రభావం కలిగిన వ్యాపారాల ప్రోత్సాహానికి ఇరు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. ఈ కార్యక్రమం జిల్లాలో మహిళా సాధికారత మరియు సమగ్ర అభివృద్ధికి ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# జిల్లాలో ఈ నెల 17 నుంచి కేంద్ర ప్రభారీ అధికారి పర్యటన



విజయవాడ, పెన్ పవర్, జూన్, 16, జిల్లాలోని ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ) కింద ఉన్న పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల్లో పర్యటించి.. లక్ష్యాల సాధనలో పురోగతిని స్వయంగా పరిశీలించేందుకు కేంద్ర ప్రభారీ అధికారి, జాతీయ జల మిషన్ (ఎన్‌డబ్ల్యూఎం) డైరెక్టర్ నేలపట్ల అశోక్‌బాబు ఈ నెల 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల 17వ తేదీన పెనుగంచిప్రోలు మండలంలో పెనుగంచిప్రోలుతో పాటు గుమ్మడిదుర్రు, లింగగూడెం, తోటచెర్ల, శనగపాడు గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పర్యటించనుండగా.. 18వ తేదీన ఇబ్రహీంపట్నం మండలంలో ఇబ్రహీంపట్నంతో పాటు కొటికలపూడి, మూలపాడు, జూపూడి, కొండపల్లి, గుంటుపల్లి గ్రామాల్లో రోజంతా క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. ఈ నెల 19న జిల్లా కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లు, అంగన్వాడీ కేంద్రాలు, శనగపాడు గ్రామంలోని గ్రామీణ కృషి పరిజ్ఞాన్ కేంద్రం (జీకేపీకే), గుంటుపల్లి లోని రైజ్ కేంద్రం, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే), ఉన్నత పాఠశాలలు, పంట పొలాలు, ఉద్యాన పంటలు, జల జీవన్ మిషన్ పనులు తదితరాలను సందర్శిస్తారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులతో మాట్లాడుతారు. అదేవిధంగా మండలస్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహిస్తారు. ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం, మౌలిక వసతులు తదితర అంశాలకు సంబంధించిన కీలక సామాజిక, ఆర్థిక సూచికల్లో పురోగతిపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేస్తారు. పర్యటనలో భాగంగా ఆయా గ్రామాల ప్రజలతోనూ ప్రభారీ అధికారి అశోక్‌బాబు మమేకమవుతారు..

# గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యలపై ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఆగ్రహం



విజయవాడ, పెన్ పవర్, జూన్, 16, ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ మాట్లాడుతూ మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం హోంమంత్రి అనిత గురించి గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించాల్సినవే. రాజకీయాల్లో విమర్శలు సహజం. కానీ మహిళలను అవమానించేలా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదు.ఒక మహిళా మంత్రిని "మేకప్ మంత్రి" అని సంబోధించడం ఆమెను మాత్రమే కాదు, మహిళలందరినీ అవమానించినట్టే.మహిళల రూపం, దుస్తులు, మేకప్ గురించి మాట్లాడటం రాజకీయ విమర్శ కాదు. అది మహిళల గౌరవాన్ని కించపరచడమే. ఒక మహిళను ఆమె రూపాన్ని బట్టి కాదు, ఆమె పనితీరు, సామర్థ్యాన్ని బట్టి అంచనా వేయాలి. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మరింత బాధాకరం. రాజకీయ విభేదాలు ఉంటే విధానాలపై చర్చించాలి గానీ, వ్యక్తిగత దూషణలకు దిగకూడదు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు సమాజానికి తప్పు సంకేతాలు పంపుతాయి. మహిళలకు రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్ గురించి దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న ఈ సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అత్యంత విచారకరం. ఇలాంటి వ్యాఖ్యలు మరింత మంది మహిళలు రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తిని దెబ్బతీసే ప్రమాదం ఉంది. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్న ఈ సమయంలో వారిని నిరుత్సాహపరిచే వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా రాజకీయంగా ఎవరూ ఎదగలేరు. నైతిక విలువలు, సంస్కారం లేనివారు ఎప్పటికీ నిజమైన నాయకులు కాలేరు. మహిళల పట్ల గౌరవం చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రజా జీవితంలో ఉన్నవారికి ఆ బాధ్యత మరింత ఎక్కువ. ఇలాంటి వ్యాఖ్యలను మహిళా సమాజం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే ఈ వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ తీవ్రంగా ఖండిస్తోంది. గుడివాడ అమర్‌నాథ్ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి.

# ఇద్దరికి కారుణ్య నియామక పత్రాలు అంద జేసిన జిల్లా కలెక్టర్ ఎం. సాయి కాంత్ వర్మ





గుంటూరు, పెన్ పవర్, జూన్, 16, గుంటూరు జిల్లాలో ఇద్దరు అభ్యర్థులకు కారుణ్య నియామక పత్రాలను జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. వైద్య,ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖలలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ నియామక ఉత్తర్వులను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విధులను అంకితభావంతో, బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు.

ఉద్యోగులుగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ అశు తోష్ శ్రీవాస్తవ పాల్గొన్నారు.

# కోడిగుడ్డు బుర్రకేం తెలుసు మహిళ విలువ..!-టీడీపీ మహిళా నేతల ఆగ్రహం

మాచర్ల పెన్ పవర్,జూన్ 16 వైసీపీ హయంలో రాష్ట్రాభివృద్ధికి ఐటీ కంపెనీలు తీసుకొస్తారనుకుంటే అప్పడాలు, వడియాల కుటీర పరిశ్రమలు గురించి ఆలోచించే కోడిగుడ్డు బుర్రకేం తెలుసు మహిళల విలువ అంటూ మాచర్ల టీడీపీ మహిళా నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సొసైటీ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారు మాట్లాడారు. హోం శాఖ మంత్రి వంగలపూడి అనితపై దారుణ వ్యాఖ్యలు చేసి, మహిళల మనోభావాలు దెబ్బతీసేలా కించపరిచిన గుడివాడ అమర్నాథ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ హయంలో మహిళలు అనేక రకాలుగా అణచివేతకు గురైయ్యారని, దాదాపు 30 వేలకు పైగా మహిళల అక్రమ రవాణ జరిగిందని ఆరోపించారు. అనంతరం గుడివాడ చిత్రపటంపై కోడిగుడ్లు కొట్టి నిరసన తెలియజేశారు.

# ఉద్యోగంతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం, పేరు ప్రతిష్ఠలు : ప్రత్తిపాటి

## ముఖ్యమంత్రి కష్టం.. శ్రమ, లోకేశ్ ఆలోచనల వల్లే రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు.





చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 16 : చిలకలూరిపేట : కూటమి ప్రభుత్వం తమ ఉజ్వల భవిష్యత్ కోసమే కంపెనీలు, సంస్థలతో కలిసి జాబ్ మేళాలతో ఉపాధి కల్పిస్తోందనే వాస్తవాన్ని యువత గ్రహించాలని, ఎక్కువ జీతభత్యాలు ఆశించకుండా, ముందు జీవితాలు చక్కదిద్దుకునే ఆలోచన చేయాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, తన సహాయ సహకారాలతో స్థానిక ప్రత్తిపాటి గార్డెన్స్ లో ఏర్పాటుచేసిన ఏపీఐఐసీ మెగా జాబ్ మేళాను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి ప్రత్తిపాటి మంగళవారం ప్రారంభించారు. అనంతరం మేళాకు హాజరైన యువతీ యువకులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు.

ఉద్యోగంతోనే యువతకు గుర్తింపు, గౌరవం..

పోటీ ప్రపంచంలో గెలిచే దిశగా జిల్లా యువత తమ నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, అందివచ్చే ఎలాంటి అవకాశాన్ని అయినా సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాటి యువతకు సూచించారు. ఉద్యోగంతోనే జీవితానికి గుర్తింపు, విలువ, సమాజంలో గౌరవంతో పాటు పేరు ప్రతిష్టలు ఉంటాయనే నిజాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని, కలలను గమనించి, సమయాన్ని వృథా చేయకుండా యువత ముందుకు సాగాలని ప్రత్తిపాటి సూచించారు. నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టాలని, అప్పుడే వారి జీవితాలకు ఉద్యోగ భద్రత లభిస్తుందని ప్రత్తిపాటి సూచించారు. పెద్ద ఎత్తున ప్రభుత్వం తీసుకొచ్చే పెట్టుబడులు, పరిశ్రమలతో రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రత్తిపాటి చెప్పారు. ముఖ్యమంత్రి కష్టం, మంత్రి లోకేశ్ వినూత్న ఆలోచనలతోనే 23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. 25 లక్షల ఉద్యోగాలు అందించే దిశగా ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోందని, ఆ లక్ష్యం పూర్తైతే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యే ఉండదని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై పారిశ్రామిక వర్గాల్లో ఉన్న సానుకూల దృక్పథం, విశ్వసనీయత వల్లే పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం మేటిగా నిలుస్తోందన్నారు. నేటి జాబ్ మేళాకు టెక్ మహీంద్రా, జోయ్ అలుక్కాస్, కియా మోటార్స్, హెటిరో డ్రగ్స్, టాటా ఎలక్ట్రానిక్స్, ఫ్యూచర్ ఐటీ సొల్యూషన్స్, డిక్సన్, టాటా కేపిటల్, రిలయన్స్, జియో, బ్యాంక్ఆఫ్ బరోడా, ఎంఆర్ఎఫ్ వంటి ప్రఖ్యాత కంపెనీల రావడం శుభ పరిణామమని, యువతకు మంచి ఉపాధిఅవకాశాలు లభిస్తాయని ప్రత్తిపాటి ఆశాభావం వ్యక్తం చేశారు.

జగన్ విధ్వంస ఆలోచనలే రాష్ట్ర ప్రగతికి అడ్డుగోడలు

జగన్..ఆయన పార్టీ రాష్ట్రానికి ప్రమాదకరంగా మారారని విధ్వంసపు ఆలోచనలతో రాష్ట్ర ప్రగతికి అడ్డుగోడలుగా తయారయ్యారని,, నిరుద్యోగుల కలలను నిజం చేస్తున్న ప్రభుత్వంపై వారు చేస్తున్న దుష్ప్రచారాన్ని యువత తిప్పికొట్టాలని ప్రత్తిపాటి సూచించారు. జగన్ తన ఎన్నికల ప్రచారానికి వాడుకున్న మెగా డీఎస్సీ కలను లోకేశ్ కేవలం ఏడాదిలోనే డీఎస్సీ నియామక ప్రక్రియను పూర్తి చేసి తన సమర్థత నిరూపించుకున్నాడని ప్రత్తిపాటి పేర్కొన్నారు. జగన్ విధ్వంస పంథా, ఆయన పార్టీ ఆలోచనలు మారకపోతే వచ్చే ఎన్నికల్లోనూ వైసీపీకి 2024 ఫలితాలే మిగులుతాయన్నారు. జగన్ రాష్ట్ర యువతను మత్తుకు బానిసల్ని చేసి, వారి జీవితాలను చీకట్లపాలు చేశాడని, ఏపీని గంజాయి, మాదకద్రవ్యాలకు కేరాఫ్ గా మార్చాడని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు.

వచ్చే నెలలో దివ్యాంగులకు ప్రత్యేక జాబ్ మేళా : కలెక్టర్ కృతికా శుక్లా

గత రెండేళ్లలో నియోజకవర్గంలో 1500 మంది నిరుద్యోగులకు కంపెనీల ఆఫర్ లెటర్లు వచ్చాయని, 600 మంది ఉద్యోగాల్లో చేరారని, నేటి జాబ్ మేళాలో 2000కు పైగా ఉద్యోగాలకు అర్హులను ఎంపిక చేయడం జరుగుతోందని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. ఈ రెండేళ్లలో జిల్లాలో 6,500 ఉద్యోగాలు భర్తీ చేసినట్టు ఆమె చెప్పారు. వచ్చే నెలలో దివ్యాంగులకు ప్రత్యేక జాబ్ మేళా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. నైపుణ్య పోర్టల్ లో యువత తమ వివరాలు నమోదు చేసుకొని మంచి ఉద్యోగాలు పొందాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, ఎమ్మార్వో వేణు గోపాలరావు, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, టీడీపీ నాయకులు బత్తినేని శ్రీనివాసరావు, కొత్త కోటేశ్వరరావు, షేక్ మస్తాన్ వలి, మురకొండ మల్లిబాబు, నిర్వాహకులు కంచర్ల శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి ఆధికారులు తమ్మాజీ రావు, రామాంజనేయులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# గాదె సాయి కృష్ణ మిస్సింగ్ కేసుపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరపాలి : పడవల మోహన్ త్రినాథ్

## అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్



గూడూరు, పెన్ పవర్, జూన్ 16 గాదె సాయి కృష్ణ మిస్సింగ్ కేసులో ఆయన తల్లి, మేనమామలు చేస్తున్న ఆరోపణలు అత్యంత ఆందోళన కలిగిస్తున్నాయి. ఒక కుటుంబం తమ బిడ్డ ఆచూకీ కోసం ఆవేదనతో న్యాయం కోరుతున్న ఈ సమయంలో ప్రభుత్వం, పోలీసు శాఖ ఈ కేసును అత్యంత ప్రాధాన్యతతో తీసుకోవాలి.ఈ కేసులో వెలువడుతున్న అన్ని ఆరోపణలపై నిష్పక్షపాతంగా, పారదర్శకంగా మరియు వేగవంతంగా విచారణ జరిపి నిజానిజాలను ప్రజల ముందుకు తీసుకురావాలి. విచారణపై ఎలాంటి అనుమానాలు తలెత్తకుండా, అవసరమైతే ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ (CBI)కి అప్పగించి సమగ్ర దర్యాప్తు నిర్వహించాలి. ఒక కుటుంబం న్యాయం కోసం ఎదురుచూస్తున్న సమయంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, గాదె సాయి కృష్ణ ఆచూకీ మరియు కేసు వెనుక ఉన్న వాస్తవాలను త్వరితగతిన వెలికితీయాలి.గాదె సాయి కృష్ణ కుటుంబానికి న్యాయం జరగాలి. నిజాలు వెలుగులోకి రావాలి. దోషులు ఎవరైనా చట్టం ముందు నిలబడాలి.

# అమర్నాథ్ గౌడ్ హత్య వైసీపీ పతనానికి నాంది ఎమ్మెల్యే నసీర్



గుంటూరు, పెన్ పవర్, జూన్, 16, వైసీపీ ప్రభుత్వంలో పదేళ్ల బాలుడు పదో తరగతి బాలుడు అమర్నాథ్ గౌడ్ హత్య వైసిపి పతనానికి నాంది పలికిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. వైసీపీ హయాంలో హత్యగావించబడిన అమర్నాథ్ గౌడ్ మృతి చెంది మూడేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం స్థానిక బస్టాండ్ ఎదురుగా గల గౌత లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలకు జరిగిన తీవ్ర అన్యాయం ప్రతి గుండెనూ ఇప్పటికీ కలచి వేస్తోందన్నారు. తన సోదరిపై వైసీపీ నేత వేధింపులు ప్రశ్నించిన పదో తరగతి బాలుడు అమర్నాథ్ గౌడ్ పై పెట్రోల్ పోసి పాశవికంగా హత్య చేయడం దారుణమన్నారు. బీసీ వర్గాల పట్ల వైసీపి వైఖరికి ఈ దుర్మార్గపు చర్య అద్దం పడుతుందన్నారు. అప్పట్లో బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అండగా నిలుస్తానని భరోసా కల్పించారని,. చెప్పిన విధంగా తెలుగుదేశం పార్టీ అమర్నాథ్ కుటుంబానికి వెన్నుదన్నుగా నిలిచిందని తెలిపారు. భయరహిత సమాజ నిర్మాణానికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందన్నారు. మహిళల భద్రతకు పెద్ద పేట వేస్తోందని, అందులో భాగంగా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి శాంతిభద్రతలను పటిష్టంగా అమలు చేస్తోందని చెప్పారు. బాలుడు అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి జరిగిన అన్యాయానికి వైసీపీ ఏమని సమాధానం చెబుతుందో ఆ నాయకులు స్పష్టం చేయాలన్నారు. ,ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడ్డారు కాబట్టే రాష్ట్ర ప్రజలు కేవలం 11 సీట్లకే పరిమితం చేసి తగిన బుద్ధి చెప్పారన్నారు. రాష్ట్రంలో మహిళలపై దాడులను కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని మరోసారి స్పష్టం చేస్తున్నామన్నారు.

# ఢిల్లీ వేదికగా సేవా గళం : పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రజాశ్రేయస్సుకై కదిలిన మండలనేని చరణ్ తేజ

## ఐదు రాష్ట్రాల ముఖ్య నేతల సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా చరణ్ తేజ






చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 16 : చిలకలూరిపేట : దేశ రాజధాని ఢిల్లీలో జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఐదు రాష్ట్రాల ముఖ్య నాయకులతో అత్యంత ప్రతిష్టాత్మకంగా 'సేవా గళం' సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు వివిధ ప్రాంతాల నుండి ప్రముఖులు హాజరు కాగా, ప్రధాత మండలనేని చరణ్ తేజకు ప్రత్యేక ఆహ్వానం లభించింది. ఈ ప్రతిష్టాత్మక వేదికపై చరణ్ తేజ పాల్గొనడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

సేవా గళంలో కీలక చర్చలు.. గళం విప్పిన చరణ్ తేజ

ఈ సమావేశంలో దేశ, రాష్ట్ర పురోభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా పలు కీలక విషయాలపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఇందులో భాగంగానే చరణ్ తేజ కూడా పాల్గొని, తనదైన శైలిలో గళం విప్పారు. స్థానిక సమస్యలను, ప్రజల ఆకాంక్షలను ఈ జాతీయ స్థాయి వేదికపై ఆయన సమర్థవంతంగా ప్రస్తావించి అందరి దృష్టిని ఆకర్షించారు.

"టార్చ్ బేరర్స్ కరచాలనం".. ఒకరు దేశ ప్రయోజనాల కోసం, మరొకరు స్థానిక భవిష్యత్ కోసం!

ఈ సమావేశంలో పవన్ కళ్యాణ్, చరణ్ తేజల కలయిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒకరు దేశ ప్రయోజనాల కోసం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం పరితపించే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అయితే.. మరొకరు స్థానిక ప్రజల భవిష్యత్తు కోసం, క్షేత్రస్థాయి ప్రగతి కోసం అహర్నిశలు శ్రమించే యువ యోధుడు నేని చరణ్ తేజ. ఈ ఇద్దరు టార్చ్ బీరర్స్ కరచాలనం చేసుకున్న దృశ్యం.. వారిద్దరి లక్ష్యం ఒక్కటేనని, అది "ప్రజా శ్రేయస్సే" అని చాటిచెప్పింది.

ఇద్దరు యోధుల కలయిక.. ప్రజా క్షేమమే పరమావధి

సమాజంలో మార్పు కోసం, ప్రజల కష్టాలను తీర్చడం కోసం అహర్నిశలు శ్రమించే ఈ ఇద్దరు నాయకుల కలయిక రాబోయే రోజుల్లో సరికొత్త మార్పులకు సంకేతంగా నిలిచింది. పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా, చరణ్ తేజ స్థానిక స్థాయిలో ప్రజా సేవలో మరింత దూసుకుపోవడానికి ఈ ఢిల్లీ పర్యటన సరికొత్త ఉత్తేజాన్ని ఇచ్చిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఓటు హక్కు ధ్రువీకరణ వివరాలు సమర్పించిన ప్రత్తిపాటి దంపతులు

## అనర్హుల ఓట్ల తొలగింపు ఎంత ముఖ్యమో, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకమన్న ప్రత్తిపాటి పారదర్శకంగా సకాలంలో సర్వే పూర్తిచేయాలని బీఎల్ఓలకు సూచించిన ఎమ్మెల్యే.



చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 16 : చిలకలూరిపేట : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్), ప్రక్రియలో అత్యంత కీలకమైన ఇంటింటి సర్వే విధి విధానాలపై ప్రత్తిపాటి బీఎల్ఓలతో మాట్లాడారు. మంగళవారం ప్రత్తిపాటి పుల్లారావు బీఎల్ఓలు అందించిన ఎన్యుమరేషన్ ఫాంలను పూర్తిచేసి, స్వయంగా తమ ఓటు హక్కుకు సంబంధించిన స్వీయ ధ్రువీకరణ యొక్క పూర్తి సమాచారాన్ని అందించారు. ప్రత్తిపాటి దంపతులు తమ గుర్తింపుకార్డులను, వయసు ధృవీకరణ పత్రాలను, ఇతర కుటుంబసభ్యుల ఓట్ల వివరాలను, ప్రస్తుత నివాస చిరునామాను సిబ్బందికి అందించారు. వివరాల అందజేత అనంతరం ప్రత్తిపాటి బీఎల్ఓలతో మాట్లాడారు. ఇంటింటి సర్వే జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనర్హుల ఓట్లు తొలగించడం ఎంత ముఖ్యమో, 18 ఏళ్లు నిండిన అర్హుడైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం కూడా ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకమని ప్రత్తిపాటి ఈ సందర్భంగా స్పష్టంచేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సకాలంలో సర్వే పూర్తి చేయాలని ఎమ్మెల్యే బీఎల్ఓలకు సూచించారు. ఒక ప్రజాప్రతినిధిలా కాకుండా సామాన్య వ్యక్తిలా ప్రత్తిపాటి తాము కోరిన సమాచారాన్ని అందించి సహకరించడంపై బీఎల్ఓలు హర్షం వ్యక్తం చేశారు.

# ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష -- రూ.6లక్షల జరిమానా



తిరుపతి :పెన్ పవర్,జూన్ 16 ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం (=ూూఖీ) కఠిన చర్యలు అమలు చేస్తోంది. ఆర్ఎస్ఎఎస్టీఎఫ్ హెడ్ ఎల్ సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎఎస్పీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 74/2018 కేసులో ఈ ముద్దాయి పెరుమాళ్లపల్లి బీటు, టీఎన్ పాళెం సెక్షన్, తిరుపతి రేంజ్ పరిధిలో అరెస్టయ్యాడు. ఈ వ్యక్తి తమిళనాడు, వేలూరు జిల్లా అనైకట్టు తాలూకా, పెరియపట్టి గ్రామానికి చెందిన ముత్తు ఎలుమలై, కాగా ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు అతనిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ తెలిపారు.

# విద్యార్థులకు యూనిఫారం,నోటు పుస్తకాలు పంపిణీ



భట్టిప్రోలు పెన్ పవర్ (జూన్ 16) భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల (మోడల్) విద్యార్థులకు 2026-27 విద్యా సంవత్సరమునకు ప్రభుత్వం వారు సరఫరా చేసిన ఎస్ ఆర్ కె వి ఎం కిట్స్ లో భాగంగా యూని ఫారమ్స్, బెల్టులు,విద్యార్థులకు అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ చిలుకోటి నాగప్రసాద్, వైస్ ఛైర్మన్ కర్రా మరియమ్మ,గ్రామ పెద్దలు మాచర్ల నాగరాజు,దీపాల శివప్రసాద్,జొన్నాదుల వెంకటేశ్వరరావు, పులిమి డోలా ప్రసాద్, అనగాని ఏడుకొండలు,గోలి రాజ్యలక్ష్మి మరియు విద్యార్థుల తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధి ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయం - ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు( భట్టిప్రోలు పెన్ పవర్ (జూన్16) కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు అభివృద్ధి సంక్షేమంతో కూడిన సుపరిపాలన అందించడం జరిగిందని వేమూరు ఎమ్మెల్యే నక్క ఆనందబాబు తెలియజేశారు, కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై నియోజకవర్గ స్థాయిలో భారీ బహిరంగ సభ నిర్వహించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు గ్రామాల్లో విద్వేషాలు రెచ్చగొడుతున్నారన్నారు, వేమురు నియోజకవర్గంలో తన హయాంలో చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలందరికీ తెలుసు అన్నారు, నియోజకవర్గంలో కి ఎక్కడుందో వచ్చి తాను చేసింది అభివృద్ధి ఏదో చెప్పాలంటూ చవాకులు పేలుతున్నారని తన మీద పోటీ చేసి గెలిచిన వ్యక్తి ఇక్కడ లేకుండా పారిపోతే తాను ఎవరికి చెప్పాలని ఆనందబాబు ప్రశ్నించారు, నియోజకవర్గంలో తన హాయామములో చేసిన అభివృద్ధి తప్ప గత ప్రభుత్వంలో ఏమైనా అభివృద్ధి జరిగిందా ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు, ఎమ్మెల్సీ జోనల్ పరిశీలకులు బిటి నాయుడు మాట్లాడుతూ జగన్ పాలనలో దోచుకోవటం దాచుకోవడం తప్ప జరిగిందేమీ లేదన్నారు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారని గుర్తు చేశారు, భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే మళ్లీ కూటం ప్రభుత్వమే అధికారంలో ఉండే విధంగా ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు, సమావేశంలో కార్పొరేషన్ చైర్మన్, వేమూరు నియోజకవర్గ పరిశీలకులు వెంకటేశ్వరరాజు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, జొన్నలగడ్డ విజయ్ బాబు, డాక్టర్ కనకాల మధుసూదన్ ప్రసాద్, తూనుగుంట్ల



సాయిబాబా, శివారెడ్డి, మొవ్వ శరత్చంద్ర, జనసేన పార్టీ నాయకులు సోమరౌతూ అనురాధ, అమ్మిశెట్టి శ్రీరామ్మూర్తి, బిజెపి నాయకులు అమర్నాథ్, మండల పార్టీ ల అధ్యక్షులు గాజుల వెంకటసుబ్బయ్య, మైనేని మురళీకృష్ణ, సురేష్ బాబు, వాకా శేషుబాబు, యార్డ్ వైస్ చైర్మన్ అమ్మిశెట్టి కిషోర్, షేక్ అనీఫ్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ప్రభాకరరావు, ఐదు మండలాల తాసిల్దార్లు, ఎంపీడీవోలు ఉన్నారు.

# ఈనెల 18న యోగాంధ్ర....

## పాల్గొననున్న జిల్లా కలెక్టర్. వినోద్ కుమార్,

భట్టిప్రోలు,పెన్ పవర్ (జూన్ 16):

ఈనెల 18వ తేదీన మండల కేంద్రమైన భట్టిప్రోలు లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్ వెంకటరమణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుచున్న యోగంధ్ర కార్యక్రమానికి కలెక్టర్ వినోద్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉన్నారని ఆమె తెలిపారు. మండల స్థాయిలో భట్టిప్రోలు నందలి బౌద్ధ స్తూపము వద్ద నిర్వహించనున్న యోగా కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, పంచాయితీ అభివృద్ధి



అధికారులు,మరియు స్వర్ణ గ్రామ సిబ్బంది అందరు పాల్గొనవలసినదిగా ఆమె కోరారు.

# రెండేళ్ల నమ్మకం--అభివృద్ధి--సంక్షేమం కమిషనర్ కె.మయూర్ అశోక్






గుంటూరు, పెన్ పవర్, జూన్, 16, సభ జరిగే జాతీయ రహదారికి చేరువలోని సత్యసాయి నగర్ గ్రౌండ్ ని వివిధ శాఖల అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించి, చేపట్టాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సభకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ కూర్చునేలా ఏర్పాటు చేసిన జర్మన్ షెడ్లను, వీఐపీ గ్యాలరీలను, లబ్ధిదారుల కోసం కేటాయించిన ప్రత్యేక బ్లాకులకు వేరువేరుగా మార్గాలు సిద్ధం చేయాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు ఇబ్బంది పడకుండా ఫ్యాన్లు, కూలర్లు, మజ్జిగ ప్యాకెట్లు, తాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సభా వేదిక నిర్మాణం, బారికేడ్ల ఏర్పాటు, ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఎంట్రీ-ఎగ్జిట్ పాయింట్లు ఉండాలన్నారు. సభకు వచ్చే సాధారణ ప్రజలకు, లబ్ధిదారులకు ఎక్కడా మౌలిక వసతుల కొరత రాకూడదని స్పష్టం చేశారు. సభ విజయవంతం కావడానికి పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ ట్రాఫిక్ మళ్లింపులు, వాహనాల పార్కింగ్ స్థలాలను ఖరారు చేయాలన్నారు. అత్యవసర అంబులెన్స్ లతో అందుబాటులో ఉంచడంతో పాటు, మెడికల్ క్యాంప్ లు ఏర్పాటు చేయాలని డిఎండహెచ్ఓని ఆదేశించారు. అగ్నిమాపక వాహనాలను కూడా సభా ప్రాంగణంలో ఉంచాలన్నారు. సభా వేదిక, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులను చేపట్టాలని, సభలో గ్యాలరీల వారీగా పారిశుధ్య కార్మికులు ఉండేలా చూడాలని జిఎంసి సిఎంఓహెచ్ ని, మహిళలు, పురుషులకు, విఐపీలకు వేరు వేరుగా మొబైల్ టాయ్ లెట్స్ ఏర్పాటు చేయాలని ఎస్ఈని ఆదేశించారు. సభా ప్రాంగణంలో వివిధ శాఖలకు సంబంధించిన స్టాల్స్ ని ఏర్పాటు చేయడానికి తగిన స్థలాన్ని కేటాయించాలన్నారు. పర్యటనలో ఆర్డీఓ శ్రీనివాసరావు, డిఎండహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతి కళ, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు వివిధ విభాగాల అధికారులు పాల్గొనారు.

# జగ్గయ్యపేట నియోజకవర్గం జనసేన పార్టీలో చేరికల సమన్వయానికి జాయినింగ్స్ కమిటీ

## - 14 మంది సభ్యులతో ఆంధ్ర ప్రదేశ్ కమిటీ ఏర్పాటు
## - త్వరలో తెలంగాణ కమిటీ

జగ్గయ్యపేట,పెన్ పవర్,జూన్ 16 జనసేన పార్టీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్న ఇతర పార్టీల నేతలు, విద్యావంతులు, సామాజికవేత్తలు,తటస్థులను పార్టీలోకి ఆహ్వానించేందుకు ప్రత్యేకంగా జాయినింగ్స్ కమిటీని నియమించాము. 14 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారి చేరికలను సమన్వయం చేస్తుంది. ఈ కమిటీలో ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్, పంతం నానాజీ, ఎంపీ లింగమనేని రమేష్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి,

మాజీ ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, సామినేని ఉదయభాను, పార్టీ సీనియర్ నేతలుకొటికలపూడి చినబాబు, డా.హరిప్రసాద్, డా.పెదపూడి విజయ్ కుమార్, శ్ కొరికాన రవికుమార్, వంపూరుగంగులయ్య,టి సి వరుణ్, శ ఆరణి మదన్ సభ్యులుగా ఉంటారు. ఢిల్లీ పర్యటన అనంతరం ఈ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి పార్టీలో చేరికలపై దిశానిర్దేశం చేస్తాను. ఆంధ్ర ప్రదేశ్ తరహాలోనే తెలంగాణలోనూ జాయినింగ్స్ కమిటీ



నియామకానికి సన్నాహాలు చేస్తున్నాము అని తెలిపారు.

# మహిళలను అవమానపరచటం అమర్నాథ్ కు సరికాదు..





పెదకూరపాడు పెన్ పవర్,జూన్ 16 మహిళల రాజకీయ సాధికారతకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయని పల్నాడు జిల్లా టిడిపి ఉపాధ్యక్షురాలు షేక్ ముంతాజ్ అన్నారు. మంగళవారం మండల టిడిపి కార్యాలయంలో మహిళలతో కలిసి ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హోం మంత్రి అనిత పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమర్నాథ్ పై మండిపడ్డారు. మహిళలు రాజకీయంగా మరింత ముందుకు రావాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యువనేత మంత్రి నారా లోకేష్ బాబు 33 శాతం రిజర్వేషన్ కల్పించి వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నారు అన్నారు. దళిత మహిళగా ఉన్నత విద్యను అభ్యసించి, రాజకీయంగా ఎన్నో పోరాటాలు చేసి రాష్ట్ర హోంమంత్రిగా ఎదిగిన వంగలపూడి అనిత పై వైసీపీ మాజీ మంత్రి గుడివాడ అమర్ నాద్ చేసిన వ్యాఖ్యలు అత్యంత నిచమన్నారు. ఆయన వ్యాఖ్యలు రాష్ట్రంలోని మహిళలతో పాటు దేశంలోని ప్రతి మహిళను అవమానించే విధంగా ఉన్నాయన్నారు. రాజకీయంగా ప్రత్యర్థులను ఎదుర్కోలేక వ్యక్తిగత అంశాలు,వ్యక్తిగత హననం, దుస్తులు, మేకప్ వంటి విషయాలను ప్రస్తావించడం తగదని ఆమె పేర్కొన్నారు. రాజకీయాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ తల్లి, చెల్లి, భార్య వంటి మహిళా బంధువులు ఉంటారని, మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేయడం సమాజానికి మంచిది కాదన్నారు. రాజకీయ నాయకుల విధానాలు, నిర్ణయాలపై విమర్శలు చేయవచ్చునని, కానీ వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని స్పష్టం చేశారు. సాధారణ కుటుంబం నుంచి ఉపాధ్యాయునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించి, కష్టపడి హోంమంత్రి స్థాయికి చేరుకున్న అనితపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. రాష్ట్ర హోంమంత్రి హోదాలో ఉన్న ఒక దళిత మహిళ ఆత్మవిశ్వాసంతో, గౌరవప్రదంగా ఉండకూడదా అని ప్రశ్నించారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసే వారిని ఆయా పార్టీల నాయకత్వం నియంత్రించాలని సూచించారు. 33 శాతం రిజర్వేషన్ అమలుతో భవిష్యత్తులో మరింత మంది మహిళలు రాజకీయాల్లోకి వస్తారని, వారిని నిరుత్సాహపరిచే ప్రయత్నాలు ఫలించవని అన్నారు. హోంమంత్రి అనిత పై చేసిన వ్యాఖ్యలు వారిని మరింత ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిపిస్తాయని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు చాలా వరకు మహిళలను కించపరిచే విధంగామాట్లాడుతున్నారన్నారు. ఇలా ఎన్ని సార్లు మహిళలను కించ పరిచే విధంగా మాట్లాడారో వైసీపీ నాయకులు తెలుసుకోవాలన్నారు. మహిళలను వ్యక్తిగతంగా మాట్లాడి అణగదొక్కాలని చూస్తే పదింతలు ఎదుగుతారనే విషయం వారు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఒక మహిళ రాజకీయల్లోకి వచ్చి రాణించి కష్టపడి పనిచేస్తూ ఉంటే ఏలా చేస్తున్నామో పనితీరు చూడాలన్నారు. అంతే కానీఏవైనా తప్పులు ఉంటే సరిదిద్దు కోమని చెప్పాలన్నారు. వ్యక్తి గతంగా మాట్లాడకూడదన్నారు. ఒక నాయకుడు మహిళల గురించి అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఏ పార్టీ లీడరైనా, అధ్యక్షుడైనా వారికి బుద్ధి చెప్పాలన్నారు. మహిళలను గౌరవించడం నేర్చుకుని తర్వాత రాజకీయలు చేయాలన్నారు. అమర్నాథ్ ఫోటోలకు కోడిగుడ్లతో కొట్టి బుద్ధి చెప్పారు. ఈ కార్యక్రమంలో కల్పన, రాజ్యలక్ష్మి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు

# వైసీపీ పాలనలో ఎస్సీ,బీసీ బలహీన వర్గాలపై దాడులు:- మద్దిరాల




అమరావతి పెన్ పవర్,జూన్ 16 గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచకాలు, అకృత్యాలను రాష్ట్ర ప్రజానీకం మరువలేనివని బీసీ సెల్ రాష్ట్ర నాయకులు మద్దిరాల గంగాధర్ రావు అన్నారు. చిన్న వయసులోనే అమర్నాథ్ గౌడ్పై జరిగిన దారుణ ఘటన రాష్ట్రాన్ని కలచివేసిందని, అమాయక బాలుడిపై పెట్రోల్ పోసి సజీవదహనం చేయడం మానవత్వానికే మాయని మచ్చ అని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ పాలనలో ఎస్సీ, బీసీ, బలహీన వర్గాల ప్రజలపై దాడులు, హత్యలు, వేధింపులు జరిగాయని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేశారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికార దాహంతో సొంత కుటుంబ సభ్యులకే అన్యాయం చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వ సుపరిపాలన చూసి ఓర్వలేక అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే, వైసీపీ నాయకులు ఈర్ష్యతో దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.


# బాలికొన్నత జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం ప్రిన్సిపాల్ కే. హేమ మాధవి



జగ్గయ్యపేట పెన్ పవర్,జూన్ 16 జగ్గయ్యపేట బాలికొన్నత జూనియర్ కళాశాల లో ఎం.పీ.సీ మరియు బై.పీ.సీ విభాగాలలో అడ్మిషన్స్ జరుగుచున్నాయని ప్రిన్సిపాల్ కే. హేమా మాధవి తెలియజేసారు. గత విద్యా సంవత్సరం లో బైపీసీ గ్రూప్ లో 1000 మార్కులకు 926 తమ కళాశాల విద్యార్థిని సాధించిందని తెలిపారు. కావున తల్లిదండ్రులు ఈ అవకాశం ను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కే. హేమ మాధవి కోరారు.

# అమరావతి గురుకుల పాఠశాలలో మహిళా చట్టాలపై అవగాహన తెలియజేసిన సీఐ అచ్చయ్య





అమరావతి పెన్ పవర్,జూన్ 16 పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈరోజు అమరావతి గ్రామంలోని గురుకుల పాఠశాలలో మహిళా చట్టాలపై , శక్తి యాప్, సైబర్ క్రైమ్ మరియు రోడ్ సేఫ్టీ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని అమరావతి సీఐ వై అచ్చయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్ లు మరియు మహిళా సిబ్బంది పాల్గొన్నారు. గురుకుల పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్లను తొలగించే ప్రమాదం

విజయవాడ: ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్ఐఆర్) పేరుతో అర్హులైన ఓటర్లను ఓటరు జాబితా నుంచి తొలగించే ప్రమాదం ఉందని, దీనికి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ పూర్తి బాధ్యత వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సిహెచ్ బాబూరావు అన్నారు. సోమవారం విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్, పాయికాపురం తదితర ప్రాంతాల్లో పర్యటించిన ఆయన, ఓటరు జాబితాల పరిశీలన చేపడుతున్న అధికార బృందాల పనితీరును సమీక్షించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2002 ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకుని ఎస్ఐఆర్ నిర్వహించడం వల్ల అనేక మంది ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 2002 జాబితాలో లేని సుమారు 24 శాతం మంది, అంటే 42 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును కొనసాగించుకోవడానికి అనేక పత్రాలు సమర్పించాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. సాధారణ ప్రజలకు సులభంగా అందుబాటులో లేని పత్రాలను తప్పనిసరి చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ పేరుతో లక్షలాది మంది అర్హులైన ఓటర్లను తొలగించారని ఆరోపిస్తూ, రాష్ట్రంలోని పేదలు, బలహీన వర్గాలు, సామాన్య ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నదని పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో అధికారులు ఉదయం 10 గంటల తర్వాతే పరిశీలనకు వస్తుండటంతో ప్రజలు తమ ఉపాధి పనులకు వెళ్లిపోతున్నారని, అందువల్ల సిబ్బంది సంఖ్యను పెంచి ఉదయం 7 గంటల నుంచే పరిశీలన చేపట్టాలని సూచించారు.

# రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణతో డా. జాస్తి వీరాంజనేయులు భేటీ





అమరావతి పెన్ పవర్,జూన్ 16 ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి మరింత ఆర్థిక సహకారం అవసరమని, ఆ దిశగా రాజ్యసభ వేదికగా బలమైన గళం వినిపించాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డా. జాస్తి వీరాంజనేయులు ఆకాంక్షించారు. నూతనంగా రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన తెలుగుదేశం యపార్టీ సీనియర్ నాయకులు భాష్యం రామకృష్ణ ని మంగళవారం ఉదయం గుంటూరు నగరంలోని చంద్రమౌళి నగర్‌లోని వారి కార్యాలయంలో డా. జాస్తి వీరాంజనేయులు మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డా. జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ, భాష్యం రామకృష్ణ రాజ్యసభ ప్రవేశం రాష్ట్రానికి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా మారుతుందనే నమ్మకం ఉందని తెలిపారు. రాష్ట్ర పునర్నిర్మాణం, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి వంటి కీలక రంగాలకు కేంద్రం నుంచి మరింత సహకారం రాబట్టేందుకు ఆయన ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. రాజ్యసభ వేదికగా ఆంధ్రప్రదేశ్ హక్కులు, గ్రామీణ ప్రజల సమస్యలు, అభివృద్ధి అవసరాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అధిక నిధులు సాధించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేసేలా కేంద్ర పథకాల అమలులో రాష్ట్రానికి ప్రాధాన్యత లభించేందుకు చర్యలు తీసుకోవాలని కూడా సూచించారు. రాజకీయ, సామాజిక, వ్యాపార రంగాల్లో విశేష అనుభవం కలిగిన భాష్యం రామకృష్ణ రాజ్యసభలో రాష్ట్ర ప్రయోజనాలను సమర్థవంతంగా ప్రాతినిధ్యం వహిస్తూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి విశేషంగా దోహదపడతారని డా. జాస్తి వీరాంజనేయులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు శ్రీవారి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సేవాసదన్ అధ్యక్షులు మిరియాల గోపి కుమార్, మిరియాల ప్రసాదరావు, మాజీ ఉ పసర్పంచ్ చిలకా ఆనందరావు మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు చిలకా, చిలకా యోహాను, వి వి బి ఆచారి, వై కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# రైతులకు ఎరువుల కొరత రాకుండా ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు


ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు

జులై చివరి నాటికి గ్రీన్ గుంటూరు కార్యక్రమంలో లక్ష మొక్కల నాటడం లక్ష్యం

రైతుల ఆదాయం పెంచటమే వ్యవసాయ అధికారుల లక్ష్యం కావాలి

జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ





గుంటూరు, పెన్ పవర్,జూన్ 16 జిల్లాలో రైతులకు యూరియా, డీఏపీ తదితర ఎరువుల కొరత ఎట్టి పరిస్థితుల్లోనూ రాకుండా జిల్లా మరియు మండల స్థాయిలలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్లోని విసి హాల్లో వ్యవసాయ, ఇతర అనుబంధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎరువుల నిల్వలు, పంపిణీ ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షిస్తూ అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ఎరువులు అందలేదని ఏ ఒక్క రైతు నుండి ఫిర్యాదు వచ్చినా, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. రెవిన్యూ, వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు ప్రతి మండలంలో సమావేశం నిర్వహించి యూరియా సక్రమ పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా వాతావరణ మార్పుల నేపథ్యంలో ఎల్ నినో ప్రభావం రైతులపై ప్రతికూలంగా పడకుండా వ్యవసాయ శాఖ ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, నీటి వినియోగ సామర్థ్య పెంపు, రైతులకు సాంకేతిక సలహాలు అందించే చర్యలను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా పంట పెట్టుబడి ఖర్చు తగ్గించి, రైతు ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కలిసి పనిచేయడానికి కృషి చేస్తున్నామన్నారు. రైతులకు ఆదాయం పెంచటమే వ్యవసాయ అధికారుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని స్పష్టం చేశారు. సంప్రదాయ పంటలతో పాటు అధిక లాభదాయక పంటలు, ఉద్యానవన పంటలు, విలువ ఆధారిత వ్యవసాయ విధానాలను ప్రోత్సహిస్తూ రైతుల ఆదాయాన్ని పెంచేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. రైతులకు మార్కెట్ అవకాశాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చేందుకు కృషి చేయాలని ఆదేశించారు. జిల్లా అభివృద్ధిలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోందని, రైతులకు అవసరమైన అన్ని సేవలు సకాలంలో అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్న గ్రీన్ గుంటూరు కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. జులై నెలాఖరు నాటికి కనీసం లక్ష మొక్కలను నాటే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పొలంగట్లు, చెరువుల గట్ల మీద మొక్కలు నాటే కార్యక్రమం, రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాలల్లో విస్తృత స్థాయిలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పద్మావతి, జిల్లా ఉ ద్యానవన శాఖాధికారి రవీంద్ర బాబు, ఏపీఎంఐపి పి డి వజ్రశ్రీ, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ, మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ చౌదరి, మార్క్ ఫెడ్ డిస్టిక్ మేనేజర్ నరసింహారెడ్డి, పాల్గొన్నారు.

# స్టాప్ డయేరియా క్యాంపెయిన్ - 2026 లో భాగంగా ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైద్య అధికారులు.





క్రోసూరు పెన్ పవర్,జూన్ 16 స్టాప్ డయేరియా క్యాంపెయిన్ 2026 కార్యక్రమంలో భాగంగా మంగళవారం పల్నాడు జిల్లా క్రోసూరు మండలం నాగవరంలో వైద్య అధికారులు రవికుమార్, అనిల్ కుమార్ లు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులలో డయేరియా కారణంగా సంభవించే మరణాలను పూర్తిగా నిర్మూలించటమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల వారు సమన్వయంతో వైద్య సిబ్బంది పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిబ్బందిని కోరారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, సురక్షితమైన త్రాగునీటి వినియోగం, పారిశుద్ధ్య చర్యలు మరియు డయేరియా నివారణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సిబ్బందినీ ఆదేశించారు. అలాగే ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ జూన్ 16 నుండి జులై 31, 2026 వరకు మండల వ్యాప్తంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఐదేళ్ల లోపు చిన్నారి కుటుంబానికి ఆశా కార్యకర్తల ద్వారా ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు మరియు జింక్ మాత్రలను పంపిణీ చేయడం, అన్ని ప్రభుత్వ ఆరోగ్య సంస్థలు మరియు అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ జింక్ కార్నర్లను ఏర్పాటు చేయటం వంటి చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలందరు పరిశుభ్రత పాటిస్తూ డయేరియా లక్షణాలు కనిపించిన వెంటనే ఓ ఆర్ ఎస్ మరియు జింక్ మాత్రలు ఉ పయోగించటంతోపాటు సమీప ఆరోగ్య కేంద్రాలకు వెళ్ళాలని కోరారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని శాంసన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. వైద్య అధికారులు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

- అభివృద్ధి-సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే
- కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఘనంగా రెండేళ్ల పాలన సంబరాలు
- రెండేళ్ల అభివృద్ధి ప్రస్థానానికి ప్రజల మద్దతే బలం: ఎమ్మెల్యే
- ప్రభుత్వ విజయాలను ప్రతిబింబించిన ప్రత్యేక స్టాళ్లు..ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి..





నెల్లూరు పెన్ పవర్,జూన్ 16 రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో నిర్వహించిన విజయోత్సవ సంబరాలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు.విజయోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో ప్రజలకు అందించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో ఈ వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా కస్తూరిదేవి గార్డెన్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల ప్రత్యేక స్టాళ్లను ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి సందర్శించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజల విజయగాథలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ప్రదర్శనలను పరిశీలించారు.జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ఆయా శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులకు వివరించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలపై రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని వారు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శక పాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు

ఆశీస్సులు, మార్గదర్శకత్వంతో కావలి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా నియోజకవర్గ అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ప్రజలు, అధికారులు, సిబ్బంది, కూటమి నాయకుల ఉత్సాహభరిత పాల్గొనికతో కస్తూరిదేవి గార్డెన్స్ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది.

# కనీకరంలేకుండా బీసీలను ఊచకోత కోశారు..!

## గొడ్డలి పార్టీ పరాకాష్టకు నిదర్శనం అమర్నాథ్ హత్య..!!

## ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధ్వజం..




మాచర్ల పెన్ పవర్,జూన్ 16 జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీలపై కనీకరం లేకుండా ఊచకోతకు దిగారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధ్వజమెత్తారు. బాపట్ల జిల్లా, చెరుకుపల్లి మండలం, రాజోలు ఉ ప్పాలవారిపాలెంకు చెందిన బీసీ యువకుడు అమర్నాథ్ గౌడ్ పై వైసీపీ గుండాలు అత్యంతంగా దారుణంగా దాడి చేసి, హతమార్చిన వైనాన్ని గుర్తు చేసుకుంటూ నివాళుర్పిస్తూ మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గొడ్డలి పార్టీ ధ్యేయం బీసీ, ఎస్టీ,ఎస్సీలను భయభ్రాంతుకుల గురి చేసి వేధించడమేనని విమర్శించారు. అక్కను ఏడిపిస్తున్న వైసీపీ మూకలను ప్రశ్నించిన అమర్నాథ్ గౌడ్ ను పెట్రోల్ పోసి, తగలబెట్టి దారుణంగా హత్య చేశారని వాపోయ్యారు. అంతేకాక వైసీపీ నేతలు ఎస్సీ యువకుడు డ్రైవర్ సుబ్రహ్మణ్యం డెడ్ బాడీ డోర్ డెలవరీ, డాక్టర్ సుధాకర్ పై దాడి, పశువైద్యులు డాక్టర్ అచ్చన్న హత్య, ఇలా లెక్కలేనన్ని శిరోముండనాలు వారి దాష్టికాలకు అద్దం పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్ల అధికారంలో ఉండి సొంత బాబాయ్ ను హత్య చేసిన వారిని ఎలా కాపాడుకుని, సీబీఐను తప్పుదారి పట్టించారో ప్రజలు చూశారని పేర్కొన్నారు. ఏదీఏమైనా అమర్నాథ్ మృతి ఆ కుటుంబానికి పూడ్చని లోటు అని తెలియజేస్తూ.. ఇటువంటి ఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

# అమర్నాథ్ గౌడ్‌ను స్మరించుకున్న కావలి టీడీపీ.. భావోద్వేగ నివాళులు..

- మూడేళ్లైనా మాయని గాయం.. అమర్నాథ్ గౌడ్ ఘటనను గుర్తు చేసిన టీడీపీ నేతలు
- బాధిత కుటుంబానికి న్యాయం జరగాలి.. అమర్నాథ్ గౌడ్ చిత్రపటానికి నివాళులు
- అమర్నాథ్ గౌడ్‌ను స్మరించుకొని భావోద్వేగానికి గురైన కావలి టీడీపీ నాయకులు



కావలి పెన్ పవర్,జూన్ 16 శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో మూడు సంవత్సరాల క్రితం జరిగిన అమర్నాథ్ గౌడ్ హత్య ఘటనను స్మరించుకుంటూ మంగళవారం కావలి టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు నివాళులర్పించారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమర్నాథ్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడిన టీడీపీ నాయకులు, “మా అక్కను ఎందుకు వేధిస్తున్నారు?” అని ప్రశ్నించిన పదో తరగతి విద్యార్థి అమర్నాథ్ గౌడ్‌ను వైసీపీ నేతలు పెట్రోల్ పోసి తగలబెట్టి హత్య చేశారని ఆరోపించారు. ఈ దారుణ ఘటనకు నేటితో మూడేళ్లు పూర్తవుతున్నప్పటికీ బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.అమర్నాథ్ గౌడ్ హత్య కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురు వ్యక్తులు బెయిల్‌పై బయటకు వచ్చి స్వేచ్ఛగా తిరుగుతున్నారని, బాధిత కుటుంబ సభ్యులు మాత్రం ఇప్పటికీ భయాందోళనల మధ్య జీవిస్తున్నారని పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని బెదిరించడం, హత్యాయత్నాలకు పాల్పడడం వంటి ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని వారు ఆరోపించారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక దారుణ సంఘటనలు జరిగాయని, సాధారణ ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని టీడీపీ నాయకులు విమర్శించారు. కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు, వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు వంటి సంఘటనలను ప్రస్తావిస్తూ, అప్పటి పాలనలో చట్టవ్యవస్థ బలహీనపడిందని ఆరోపించారు.అలాగే బీసీలు, ఎస్సీలు, ఎస్టీల అభివృద్ధి పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆయా వర్గాల ఆశలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. సామాజిక న్యాయం పేరుతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తోందని, ఎలాంటి నేరం జరిగినా కఠిన చర్యలు తీసుకుంటోందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. బాధితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కావలి టీడీపీ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబు, మాజీ సోమశిల చైర్మన్ కండ్లగుంట మధుబాబు నాయుడు, పట్టణ ఉపాధ్యక్షుడు దేవరకొండ శ్రీను, సీనియర్ నాయకుడు బాల గురుస్వామి, ఏరియా వైద్యశాల డైరెక్టర్ ఏటూరి శివ, 6వ వార్డు ఇంచార్జ జంపాని ప్రసాద్‌తో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమరనాథ రెడ్డి తీవ్ర స్థాయిలో అసంతృప్తి

**తిరుపతి, జూన్ 16, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేత ఎన్. అమరనాథ రెడ్డి ఎక్కడున్నారు. ఆయన టీడీపీలోనే ఉన్నారా? అసలు ఏం జరుగుతుంది? పార్టీలో ఒక్కసారిగా సైలెంట్ అయిన అమరనాథ రెడ్డి తీవ్ర స్థాయిలో అసంతృప్తికి లోనవుతున్నారా? అన్న అనుమానం కలుగుతుంది. దాదాపు రెండేళ్ల నుంచి అమరనాథ రెడ్డి పార్టీ లో యాక్టివ్ గా లేరు. గతంలో రాజకీయంగా కీలకంగా వ్యవహరించే అమరనాథ రెడ్డి ఈ టర్మ్ లో మాత్రం మౌనం పాటించడం వెనక కేవలం అసంతృప్తి కారణమని పార్టీ నేతలే చెబుతున్నారు. తనకు 2024 ఎన్నికల తర్వాత ప్రాధాన్యత దక్కడం లేదన్న అభిప్రాయంలో అమరనాథ రెడ్డి ఉన్నారు. అందుకే అమరావతికి కూడా దూరంగా ఉంటూ తన పని తాను చేసుకుంటున్నారు.చిత్తూరు జిల్లాలోని పలమనేరు నియోజకవర్గం నుంచి అమరనాథ రెడ్డి టీడీపీ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లా చిత్తూరులో ఉన్న ఈ నేత అందరినీ కలుపుకుని పార్టీని బలోపేతం చేయాల్సిన సమయం. అయితే తనకు తొలి విడత మంత్రి పదవి దక్కుతుందని భావించినప్పటికీ ఆయనకు రాలేదు. చిత్తూరు జిల్లా నుంచి కేవలం ముఖ్యమంత్రి గా చంద్రబాబు మాత్రమే ఉన్నారు. మరెవరికీ అవకాశం కల్పించలేదు. చంద్రబాబు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు మినహా మరే సందర్భంలో వీరు పెద్దగా కనిపించడం లేదు. అలాగే విపక్షాలు చేసే విమర్శలకు సయితం స్పందించడం లేదు.1996లో పుంగనూరు నియోజకవర్గంకి జరిగిన ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచి తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీకి ఎన్నికయ్యాడు. 1999లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలై, 2004లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచాడు. చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా కూడా పని చేశారు.2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పలమనేరు నియోజకవర్గం నుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 2012లో

టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు.తర్వాత జూన్ 2016లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని విడి టీడీపీలో చేరాడు. 2017లో జరిగిన

ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ విస్తరణలో భాగంగా అమరనాథ్ రెడ్డికి మంత్రి పదవి లభించింది. 2024లో ఎన్నికల్లో తిరిగి టీడీపీ నుంచి విజయం సాధించారు. ట్రాక్ రికార్డును చూసిన తర్వాత మంత్రి పదవి దక్కాల్సి ఉన్నా రాకపోవడంతో ఆయన తన పెదవి విప్పడం లేదని అంటున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## దాడి వీరభద్రరావు దారెటు..

**విశాఖపట్టణం, జూన్ 16, పెన్ పవర్:** ఉమ్మడి విశాఖ జిల్లాలో తెలుగుదేశం పార్టీలో సీనియర్ మోస్ట్ లీడర్ గా దాడి వీరభద్రరావు ఉన్నారు. ఆయన 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అలా వరసగా నాలుగు సార్లు గెలిచి అనేక మంత్రిత్వ శాఖలను నిర్వహించిన దాడి 2007 నుంచి 2013 దాకా శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడిగా కూడా వ్యవహరించారు. అయితే ఆయన వైసీపీలోకి వెళ్ళడంతో ఆయన రాజకీయ జీవితం మీదనే కాకుండా కుమారుడి రాజకీయ భవిష్యత్తు మీద కూడా తీవ్ర ప్రభావం చూపిస్తోంది.తెలుగుదేశం పార్టీలో అయ్యన్నపాత్రుడితో సరిసమానంగా దాడి వీరభద్రరావు 1980, 1990 దశకంలో రాణించారు. ఇద్దరికీ మంత్రి పదవులు ఇచ్చి ఎన్టీఆర్ గౌరవించారు. అలాగే కీలక శాఖలను కూడా ఈ ఇద్దరు నేతలూ చూశారు. పూర్వాశ్రమంలో హిందీ మాస్టార్ గా పనిచేసిన దాడి అంటే ఎన్టీఆర్ కి ప్రత్యేకమైన అభిమానం ఉంది. అందుకే ఆయనకు కీలక స్థానం పార్టీలో కల్పించారు. ఇదిలా ఉంటే పార్టీ పదవులలో కూడా దాడికి ప్రముఖ స్థానం ఉంటూ వచ్చింది. అయితే ఆయన 2013లో తన ఎమ్మెల్సీ పదవిని రెన్యువల్ చేయలేదన్న కారణంతో టీడీపీని వీడారు. రాజకీయంగా అదే పెద్ద పొరపాటు అని ఆయన వర్గీయులు చెబుతున్నారు.అనకాపల్లిలో దాడి వీరభద్రరావు తన హవాను దశాబ్దాల పాటు చాటుకుంటూ వచ్చారు. ఎపుడైతే ఆయన టీడీపీని వీడారో నాటి నుంచే ఆయన ప్రాభవం తగ్గుతూ వచ్చింది. వైసీపీలో కూడా సరైన అవకాశాలు దక్కలేదు. దాంతో 2024 ఎన్నికల ముందు తిరిగి టీడీపీలో దాడి వీరభద్రరావు చేరారు. అయితే ఆయన కుమారుడు దాడి రత్నాకర్ కి అనకాపల్లి టికెట్ ఆశించినా దక్కలేదు. అయితే 2029 ఎన్నికల మీదనే దాడి కుటుంబం ఆశలు పెట్టుకుంది అని అంటున్నారు.అయ్యన్నపాత్రుడు కుమారుడు విజయ్ కి రాజ్యసభ సభ్యత్వం ఇచ్చి వారసులకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా టీడీపీ సంకేతాలు పంపించింది. దాంతో దాడి లాంటి సీనియర్లలో కొత్త ఆశలు మొలకెత్తుతున్నాయని అంటున్నారు. తన వారసుడిని కూడా ఎమ్మెల్యేగా చూడాలని దాడి మాస్టారు ఆశ పడుతున్నారు. అనకాపల్లిలో టీడీపీ బలంగా ఉంది. ఇక దాడికి ప్రత్యేక వర్గం ఉంది. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల మీద ఫోకస్ పెట్టి దాడి కుటుంబం పనిచేస్తోంది. అయితే అనకాపల్లిలో టీడీపీకి ఎంతో మంది నాయకులు ఉన్నారు. టికెట్ కోసం భారీ పోటీ ఉంది. దాడి పార్టీని వీడాక చాలా మంది నాయకులు తయారయ్యారు. ఈ నేపథ్యంలో వారిని అందరినీ దాటుకుని అధినాయకత్వం మన్ననలు అందుకోవడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదని అంటున్నారు. ఇక పార్టీలో అవకాశాలు దక్కాలీ అంటే విధేయత కొలమాంగా చూస్తున్నారు.అలాగే పార్టీ కోసం కష్టించి పనిచేసే వారికే పట్టం కడుతున్నారు. మరి దాడి కుటుంబానికి న్యాయం జరుగుతుందా అన్నదే ఆయన అనుచరుల ఆలోచనగా ఉంది. మాస్టార్ రాజకీయ వారసత్వం కొనసాగాలని ఆయన అభిమానులు కోరుకుంటున్నప్పటికీ అనకాపల్లి టీడీపీ రాజకీయం మాత్రం అంత సానుకూలంగా లేదని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## పీక్స్ కు చేరిన బ్రదర్స్ వార్

**విజయవాడ, జూన్ 16, పెన్ పవర్:** బెజవాడ పొలిటికల్ స్క్రీన్ మీద సరికొత్త 'బ్రదర్స్ వార్' పీక్స్ కి చేరింది. నిన్నటివరకు పార్టీల మార్పు, టికెట్ల రాజకీయం చుట్టూ తిరిగిన కేశినేని సోదరుల వివాదం.. ఇప్పుడు ఊహించని మలుపు తిరిగింది. ఒకరి జాతకాలను ఒకరు రోడ్డుపైకి లాగుతూ, ఏకంగా వందల కోట్ల బ్యాంక్ స్కామ్స్, ఈడీ ఫిర్యాదుల వరకు వెళ్లడంతో ఏపీ పాలిటిక్స్ ఒక్కసారిగా వేడెక్కాయి. 2024 ఎన్నికల ముగిసినా వీరి మధ్య మంటలు చల్లారకపోగా.. మరింత ముదరడం గమనార్హం. ఈ పొలిటికల్ ఫైట్‌లో విజయవాడ సిట్టింగ్ ఎంపీ కేశినేని చిన్ని వేసిన సరికొత్త స్కెచ్ ఇప్పుడు సంచలనంగా మారింది. తనపై వస్తున్న బినామీ, భూ ఆక్రమణల ఆరోపణలకు చెక్ పెడుతూ.. ఆయన నేరుగా మాజీ ఎంపీ కేశినేని నాని ఆర్థిక మూలాలనే టార్గెట్ చేశారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకును నాని అడ్డంగా ముంచేశారని, దాదాపు రూ.120 కోట్ల ప్రజాధనాన్ని మొండి బకాయిలుగా మార్చేశారంటూ సంచలన ఆరోపణలు చేశారు. నిబంధనల్లోని లూప్‌హోల్స్‌ను వాడుకుంటూ నాని విజయవాడ 'విజయ్ మాల్యా'లా మారారని, చివరకు ఆయన ఉంటున్న ఇల్లు, వాడుతున్న హోటల్ కూడా బ్యాంక్ ఆధీనంలోనే ఉన్నాయంటూ చిన్ని బాంబ్ పేల్చారు. అయితే, తమ్ముడు వేసిన ఈ రివర్స్ అటాక్‌పై మాజీ ఎంపీ కేశినేని నాని కూడా ఏమాత్రం తగ్గడం లేదు. సోషల్ మీడియా వేదికగా ఆయన రీ-కౌంటర్ ఇచ్చారు. వేల కోట్ల ప్రభుత్వ భూములను ఒక కార్పొరేట్ సంస్థకు కట్టబెట్టే పెద్ద డీల్‌ను తాను సీఎంకు లేఖ రాసి అడ్డుకున్నానని, ఆ ఫ్రస్టేషన్‌తోనే తనపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. న్యాయ వ్యవస్థలో చిన్న లూప్ హోల్ అడ్డంపెట్టుకుని న్యాయస్థానాలనుసైతం కేశినేని నాని తప్పుదోవ పట్టించారని, తనపై పోటీ చేసిన అభ్యర్థుల్ని ఫ్రాడ్ అనటం కేశినేని నానికి అలవాటని కేశినేని చిన్ని తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ప్రజారాజ్యం పార్టీ నుంచి బయటకొస్తూ చిరంజీవి, పవన్ కళ్యాణ్‌లనూ విమర్శించాడు. ఒక్క సాక్షి మీడియా, జగన్‌ను తప్ప ఇతరులదరినీ విరమర్శించే నాని ఆంతర్యం ఏంటి? అంటూ చిన్ని ప్రశ్నించారు.జగన్ పంథాలోనే దొంగే దొంగా దొంగా అని అరిచినట్లు చేయటం నానికి అలవాటు. సామాజిక మాధ్యమం వేదికగా నాని నాపై చేసేది అసత్య ఆరోపణలే. దీనిపై పోలీసులు తమ పని తాను చేసుకెళ్తున్నారు. విజయవాడ ప్రజలకు, అలాగే చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్‌లకు మాత్రమే తాను జవాబుదారినని, సోషల్ మీడియా పోస్టులకు కాదని పేర్కొన్నారు. తనపై చేసే ఆరోపణలకు సరైన ఆధారాలు ఉంటే వాటికి సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని కేశినేని చిన్నీ స్పష్టం చేశారు.బెజవాడ పాలిటిక్స్‌లో ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ ఇద్దరు నేతల మధ్య నడుస్తున్న ఈ కోట్ల రూపాయల మైండ్ గేమ్ రాబోయే రోజుల్లో ఇంకెన్ని సంచలనాలకు దారితీస్తుందో చూడాలి.

## రామ్మోహననాయుడికి అవకాశం లేదా...

**శ్రీకాకుళం జూన్ 16, పెన్ పవర్: :** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రారంభానికి కూత వేటు దూరంలో నిలిచింది. వచ్చే నెలలో ప్రారంభోత్సవం ఉంటుందన్న టాక్ నడుస్తోంది. మరోవైపు ప్రైవేటు విమానయాన సంస్థలు తమ కార్యకలాపాలను జూలై 5 నుంచి ప్రారంభించనున్నాయి. వాటికి సంబంధించి ప్రత్యేక ప్రకటన కూడా చేశాయి. ప్రస్తుతం చూస్తుంటే మాత్రం జూలైలో విమానాశ్రయం ప్రారంభం గ్యారెంటీ అని తేలిపోయింది.భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనులు శరవేగంగా జరగడంలో.. ఉత్తరాంధ్రకు చెందిన పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కృషి ఉంది. గత రెండేళు ల్లగా ఆయన నిరంతరం పర్యవేక్షిస్తూ పనులను పరుగెత్తించారు. అందుకే పనులు చాలా వేగంగా కొనసాగాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడంతోనే చాలా వేగంగా పనులు జరిగాయి. ఇక్కడ విమాన రాకపోకలకు సంబంధించి ట్రయల్ రన్ సక్సెస్ అయ్యింది. చివరిగా పెండింగ్ పనులు జరుగుతున్నాయి. వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోంది.అయితే ఈ విమానాశ్రయ ప్రారంభోత్సవ సమయానికి కింజరాపు రామ్మోహన్ నాయుడు పరిస్థితి ఏంటనే చర్చ నడుస్తోంది. ఆయన ప్రస్తుతం పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఉన్నారు. 2024 ఎన్నికల్లో మోడీ నేతృత్వంలో ఎన్డీఏ మూడోసారి అధికారంలోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామి కావడంతో ఆ పార్టీకి రెండు మంత్రి పదవులు దక్కాయి కేంద్రంలో. రామ్మోహన్ నాయుడుకు కీలకమైన పౌర విమానయాన శాఖ దక్కింది. అయితే ఆయన బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఏదో ఒక వివాదం రేగుతూనే ఉంది. ఆయన శాఖ మార్పు ఉంటుందన్న ప్రచారం ఎప్పటినుంచో ఉంది.కేంద్ర మంత్రివర్గ విస్తరణ చేపట్టేందుకు నరేంద్ర మోడీ కసరత్తు ప్రారంభించినట్లు ప్రచారం నడుస్తోంది. ఈ నెల 20న ముహూర్తంగా నిర్ణయించినట్లు సమాచారం. ఈనెల 18 తో రాజ్యసభ ఎన్నికల ప్రక్రియ కూడా పూర్తవుతుంది.

# డీఎస్సీలో కులాల లెక్కలు జాతర

**విజయవాడ, జూన్ 16, పెన్ పవర్:**
డీఎస్సీ 2025 పై వైయస్సార్ కాంగ్రెస్ అదే పనిగా విషప్రచారం చేస్తోంది. అవి రోజురోజుకు శృతిమించి కులాల వద్దకు కూడా చేర్చింది వైయస్సార్ కాంగ్రెస్. గతంలో కమ్మ డీఎస్పీలు అంటూ 2019 ఎన్నికలకు ముందు హడావిడి చేసిన సంగతి తెలిసిందే. తీరా వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అదే పార్టీకి చెందిన మంత్రి కమ్మ డీఎస్పీలు కాదు.. అన్ని వర్గాల వారికి అవకాశం ఇచ్చారని శాసనసభలో ప్రకటించారు. అయితే ఇప్పుడు డీఎస్సీ 2025 పై దుష్ప్రచారం చేస్తున్న నేపథ్యంలో.. స్పోర్ట్స్ కోటా కింద కమ్మ సామాజిక వర్గం వారికి ఉపాధ్యాయ పోస్టులు ఇచ్చారని చెబుతూ.. కమ్మ డీఎస్సీ అంటూ ప్రచారాలు ప్రారంభించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పేటీఎం చానల్స్ లో కూర్చోబెట్టి.. రిటైర్మెంట్ తీసుకున్న అధికారులతో కమ్మ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చారంటూ విషం చిమ్మడం మొదలుపెట్టారు.డీఎస్సీ 2025 పై ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ అధికారులు ఓపికగా వివరణ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు కమ్మ డీఎస్సీ ఆరోపణలపై కూడా ఏపీ ఫ్యాక్ట్ చెక్ రంగంలోకి దిగి.. అదంతా తప్పుడు ప్రచారం అని తేల్చేసింది. ఈ డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద భర్తీ చేసిన పోస్టులు 381. ఈ 381 పోస్టుల్లో ఓపెన్ క్యాటగిరి కింద ఉన్నవి కేవలం 42 పోస్టులు మాత్రమే. మిగిలిన పోస్టులన్నీ ఎస్సీ, ఎస్ టి, బిసి, మైనారిటీ వర్గాలకు దక్కాయి. ఈ వివాదానికి ప్రధాన కారణం ఆనాలపై రెండు ఓపెన్ క్యాటగిరి పోస్టులు వాటిని పరిశీలిస్తే అందులో కమ్మ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు వచ్చినవి కేవలం 9 పోస్టులు మాత్రమే. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు పది పోస్టులు, కాపు సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు అత్యధికంగా 16 పోస్టులు వచ్చాయి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం తప్పుడు అని అందరికీ తెలుసు. ఎందుకంటే 381 పోస్టుల్లో.. 9 పోస్టులు అంటే కనీసం మూడు శాతం కూడా లేవు. కానీ ఏ లెక్క ప్రకారం స్పోర్ట్స్ కోటా మొత్తం ఒకే కులానికి కట్టబెట్టారు.. ఇందులో భారీ స్కాం జరిగింది అంటూ తప్పుడు ప్రచారాలు మొదలుపెట్టింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పేటీఎం బ్యాచ్. కేవలం మెరిట్, క్రీడా సర్టిఫికెట్ల స్క్రూట్నీ ఆధారంగా జరిగిన ఈ నియామక ప్రక్రియను.. ఒక కులానికి ఆపాదించి వివాదం చేయడం చూస్తుంటే కుట్ర కోణం అర్థం అవుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయ ఆరాటం కోసమే నిరుద్యోగ యువతను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది. దాదాపు ఆరు లక్షల మంది అభ్యర్థులు డీఎస్సీ పరీక్ష రాయడంతో వారిలో గందరగోళం రేపి రాజకీయ లబ్ధి పొందాలన్న ఆలోచన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ అది వర్క్ అవుట్ అయ్యే ఛాన్స్ లేదు. అయితే ఆధారాలు లేని ఆరోపణలతో దుష్ప్రచారం చేస్తున్న సదరు యూట్యూబ్ ఛానల్ పై కేసు నమోదు అయ్యే అవకాశం ఉంది. ఆధారాలు లేని కారణంగా ఆ యూట్యూబ్ ఛానల్ ఆ వీడియోను డిలీట్ కూడా చేసింది. కానీ వదిలిపెట్టే ప్రసక్తి కనిపించడం లేదు. నేరుగా సజ్జల ఫండింగ్ చేసిన ఆ ఛానల్ సంగతి తేల్చాలన్న అభిప్రాయం కూటమి శ్రేణుల్లో వినిపిస్తోంది.

# వేమిరెడ్డికి కీలకం పదవి...

**నెల్లూరు, జూన్ 16, పెన్ పవర్:**
నెల్లూరు అంటేనే మొదటి నుంచి కాంగ్రెస్ కి తరువాత కాలంలో వైసీపీకి అచ్చి వచ్చిన జిల్లాగా పేరుంది. రెడ్ల పెద్ద ఎత్తున రాజకీయ ప్రాబల్యం కలిగిన జిల్లాగా నెల్లూరుని చెబుతారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మొత్తం పది ఎమ్మెల్యే సీట్లు ఉంటే 2019లో పదికి పది స్వీప్ చేసి వైసీపీ శభాష్ అనిపించుకుంది. అయితే గిర్రున అయిదేళ్ల కాలం తిరిగేసరికి టీడీపీ కూటమి అదే ఫీట్ ని రివర్స్ లో చేసి వైసీపీకి భారీ షాక్ ఇచ్చేసింది. ఫలితంగా వైసీపీకి ఒక్కరంటే ఒక్కరు ఎమ్మెల్యే లేకుండా పోయారు. బలమైన నేతలు అంతా ఇపుడు టీడీపీలోనే ఉన్నారు. ఈ పరిణామాలతో వైసీపీ మొదటి నుంచి కూడదీసుకునే పనిలో ఉంది. కూటమి తన జోరుని ఎక్కడా తగ్గించడం లేదు, ప్రత్యేకించి టీడీపీ అయితే 2024లో దక్కిన విజయాన్ని ఆ రాజకీయ పట్టుని శాశ్వతం చేసుకోవాలని చూస్తోంది. దాని కోసం భారీ ఎత్తున వ్యూహ రచన కూడా చేస్తోంది.నెల్లూరు జిల్లాలో అంగ బలం అర్ధ బలం దండీగా ఉన్న నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి టీడీపీ భారీ గిఫ్ట్ ఇవ్వబోతోంది అని ప్రచారం సాగుతోంది. ఆయన 2018 నుంచి 2024 దాకా రాజ్యసభ మెంబర్ గా వైసీపీలో పనిచేశారు. వైసీపీని నెల్లూరు జిల్లాలో అన్ని విధాలుగా నిలబెట్టడంలో ఆయన కీలకమైన పాత్ర పోషించారు. ఆయనకు 2024 ఎన్నికల్లో ఎంపీ ఎమ్మెల్యే సీటు ఇవ్వడానికి వైసీపీ సుముఖత వ్యక్తం చేయకపోవడంతో టీడీపీ వైపు వచ్చారని ప్రచారం సాగింది. టీడీపీ ఆయనను సాదరంగా ఆహ్వానించి అక్కున చేర్చుకుని ఆయనకూ ఆయన సతీమణి ప్రశాంతి రెడ్డికి కూడా టికెట్లు ఇచ్చింది. దాంతో మొత్తం నెల్లూరు జిల్లా టీడీపీ కూటమికి చిక్కింది. ఈ నేపథ్యంలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి కేంద్ర మంత్రివర్గంలో పదవి దక్కుతుందని ప్రచారం ఊపందుకుంది. ఆయనకు సామాజిక పరంగానే కాదు రాజకీయంగా ప్రాంతీయ సమీకరణల దృష్ట్యా ఈ పదవిని ఇవ్వడం సముచితం అని పార్టీ పెద్దలు భావిస్తున్నారు అని అంటున్నారు. గ్రేటర్ రాయలసీమలో భాగంగా ఉన్న నెల్లూరు జిల్లాలో వేమిరెడ్డికి కేంద్ర మంత్రి పదవి ఇస్తే కనుక ఆ ప్రభావం కచ్చితంగా రాయలసీమ మీద కూడా పడుతుందని వచ్చే ఎన్నికల్లో వైసీపీ హార్డ్ కోర్ రీజియన్ గా ఉన్న రాయలసీమలో సైతం కూటమి అత్యధిక స్థానాలను గెలుచుకునేందుకు ఇది ఉపకరిస్తుందని కూడా టీడీపీ పెద్దలు వ్యూహరచన చేస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీని వీడిన వారిని వెనక్కి



రప్పించే ప్రయత్నంలో వైసీపీ అధినాయకత్వం ఉంది అని ప్రచారం సాగుతోంది. ఇక వేమిరెడ్డి మీద కూడా వైసీపీ ఫోకస్ పెట్టింది అని కూడా చెప్పుకున్నారు. ఆయన విలువ ఏమిటి అన్నది వైసీపీకి 2024 ఎన్నికల ఫలితాల తరువాత తెలిసింది అని అంటున్నారు. అయితే టీడీపీలో వేమిరెడ్డికి గౌరవం దక్కుతోంది, అంతే కాదు ఆయన అనుకున్నది చేసే పరిస్థితి కూడా ఉందని అంటున్నారు. ఇపుడు ఆయనకు కేంద్ర మంత్రి పదవి కూడా దక్కితే కనుక వైసీపీకి రాజకీయంగా మరింత దెబ్బ పడే పరిస్థితి ఉంటుందని అంటున్నారు. అంగబలం అర్ధ బలంతో పాటు కేంద్ర మంత్రిగా బలం కూడా తోడు అయితే నెల్లూరు జిల్లాలో ఫ్యాన్ రెక్కలు జోరందుకోకుండా బ్రేకులు పడతాయని అంటున్నారు. మరి ఈ ప్రచారంలో నిజమెంత అన్నది వేచి చూడాల్సి ఉంది.

**నల్లపురెడ్డి దారెటు...**

నెల్లూరు జిల్లాలో రాజకీయాలు హీటెక్కాయి. ఎన్నికలకు మూడేళ్లకు ముందే టీడీపీ, వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం జరుగుతుంది. ప్రధానంగా జిల్లాలోని కోవూరు నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు నడుస్తున్నాయి. వేమిరెడ్డిని ఎదుర్కొనేందుకు ప్రసన్నకుమార్ రెడ్డి వద్ద ప్లాన్ ఏంటి? కోవూరు నియోజకవర్గంలో ప్రశాంతి రెడ్డిని ఎదుర్కొనేందుకు నల్లపురెడ్డి వద్ద ఉన్న వ్యూహాలేంటి? అన్న దానిపై చర్చ జరుగుతుంది. ఎందుకంటే బలమైన నేతను ఎదుర్కొనాలంటే అంత ఆషామాషీ కాదు. జనంలో తీవ్రమైన వ్యతిరేకత వస్తేనే తప్ప విజయం సాధ్యం కాదు. కానీ ప్రశాంతి రెడ్డి ఆ ఛాన్స్ ను నల్లపురెడ్డికి ఎంతమేరకు ఇస్తారన్నది ప్రశ్న.కోవూరు నియోజకవర్గ రాజకీయాల్లో వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డిల మధ్య తీవ్రమైన రాజకీయ మరియు విభేదాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. రాజకీయ ఆధిపత్యం చుట్టూ తిరుగుతుంది. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మరియు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి మధ్య వార్ ఇంకా కొనసాగుతూనే ఉంది. వ్యక్తిగత విమర్శలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ప్రసన్న కుమార్ రెడ్డి గతంలో ప్రశాంతి రెడ్డిపై చేసిన అనుచిత, వ్యక్తిగత వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. వీటిపై ప్రశాంతి రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళా ఎమ్మెల్యే అయిన ప్రశాంతి రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో, మహిళల ఫిర్యాదు మేరకు ప్రసన్న కుమార్ రెడ్డిపై కోవూరు పోలీసులు కేసు నమోదు చేశారు.ఇటీవల వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాన్ని వైసీపీ నిర్వహించింది. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గంలో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి భారీగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేపైనా, కూటమి ప్రభుత్వంపైన తీవ్ర విమర్శలు చేశారు. దీనికి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఘాటుగా సమాధానం ఇచ్చారు. మెరుపుతీగలా కోవూరుకు వచ్చి వెళ్లే నేత గురించి పట్టించుకోవాల్సిన పనిలేదని ప్రశాంతి రెడ్డి నల్లపురెడ్డి పై విరుచుకుపడ్డారు. కోవూరు నియోజకవర్గం ప్రజలు తెలివైన వారని, వచ్చే ఎన్నికల్లోనూ ప్రసన్న గెలవలేంటూ సవాల్ విసిరారు. అంతేకాదు కోవూరు నియోజకవర్గంలో వైసీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కూడా తొలగించడం వివాదం గా మారింది. మొత్తం మీద ఎన్నికలకు మూడేళ్ల ముందే కోవూరు రాజకీయాలతో సలసల మండుతోంది.

# ఫిఫా వరల్డ్ కప్‌లో కోహ్లీ హవా.. విరాట్ వరల్డ్ కప్ గెలుస్తాడా?

# అంటూ ఫ్యాన్ టార్చర్.. ఐషోస్పీడ్ ఏం చేశాడంటే!





**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో జరుగుతున్న ఫుట్‌బాల్ వరల్డ్ కప్ 2026లో కూడా కింగ్ విరాట్ కోహ్లీ రేంజ్ ఏంటో తెలిసే ఒక క్రేజీ అండ్ ఫన్నీ సీన్ చోటు చేసుకుంది. వరల్డ్ ఫేమస్ యూట్యూబ్ స్ట్రీమర్ ఐషోస్పీడ్ ఒక లైవ్ స్ట్రీమింగ్‌లో ఉండగా.. ఒక ఫ్యాన్ పదే పదే కోహ్లీ గురించి అడిగిన ఒకే ఒక ప్రశ్న స్పీడ్‌కు పిచ్చెక్కించింది. దాంతో విసిగిపోయిన స్పీడ్.. తనదైన స్టైల్ లో ఇచ్చిన రియాక్షన్ ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుంది.

**కోహ్లీ కప్ గెలుస్తాడా బ్రో?:**

ఫిఫా వరల్డ్ కప్ జరుగుతున్న ఒక నగరంలో ఐషోస్పీడ్ రోడ్డుపై నడుస్తూ ఫ్యాన్స్ మధ్య లైవ్ స్ట్రీమింగ్ చేస్తున్నాడు. అక్కడ ఉన్న ఫుట్‌బాల్ వాతావరణాన్ని ఎంజాయ్ చేస్తూ అందరితో ముచ్చట్లు పెడుతున్న టైమ్‌లో.. గుంపులో ఉన్న ఒక ఫ్యాన్ గట్టిగా అరుస్తూ, ఈజ్ విరాట్ కోహ్లీ విన్నింగ్ ద వరల్డ్ కప్? (విరాట్ కోహ్లీ వరల్డ్ కప్ గెలుస్తాడా?) అని పదే పదే అడగడం స్టార్ట్ చేశాడు. అయితే, మొదట స్పీడ్ ఆ ప్రశ్నను పెద్దగా పట్టించుకోకుండా లైట్ తీసుకున్నాడు. కానీ ఆ ఫ్యాన్ మాత్రం అస్సలు తగ్గలేదు.. స్పీడ్ లైవ్ స్ట్రీమింగ్‌కు అడ్డొచ్చేలా కంటిన్యూస్‌గా అదే క్వశ్చన్‌ను రిపీట్ చేశాడు.

**చిరాకుతో ఊగిపోయిన ఐషోస్పీడ్:**

ఆ ఫ్యాన్ అడిగిన ప్రశ్నతో లైవ్‌కు డిస్టర్బెన్స్ రావడంతో.. ఐషోస్పీడ్ తన ట్రేడ్‌మార్క్ యానిమేటెడ్ అగ్రెసివ్ స్టైల్‌లో గట్టిగా అరుస్తూ, విరాట్ కోహ్లీ ఈజ్ విన్నింగ్ ద వరల్డ్ కప్! (హా.. విరాట్ కోహ్లీనే వరల్డ్ కప్ గెలుస్తున్నాడు!) అంటూ కోపంగా ఆన్సర్ ఇచ్చాడు. ఆ సీన్ చూడగానే చుట్టూ ఉన్న వాళ్లంతా ఒక్కసారిగా నవ్వేశారు. ఈ క్లిప్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది.

**ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌లో క్రికెట్ పంచాయితీ:**

ఈ వీడియో చూసిన నెటిజన్లు తెగ నవ్వుకుంటున్నారు. అక్కడ జరుగుతోంది ఫిఫా ఫుట్‌బాల్ వరల్డ్ కప్ కాబట్టి.. ఆ ఫ్యాన్ అడిగిన ప్రశ్న వచ్చే ఏడాది (2027) జరగబోయే ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ గురించి అయి ఉంటుందని ఫ్యాన్స్ డిసైడ్ అయ్యారు. ఇక క్రిస్టియానో రొనాల్డోకి పెద్ద ఫ్యాన్ అయిన ఐషోస్పీడ్‌కు.. గతంలో ఇండియా వచ్చినప్పుడు విరాట్ కోహ్లీ క్రేజ్ ఏంటో ఆల్రెడీ రుచి చూశాడు. ఇప్పుడు ఫుట్‌బాల్ వరల్డ్ కప్ వంటి ఒక గ్లోబల్ ఈవెంట్‌లో కూడా కోహ్లీ పేరు ఇలా మారుమోగిపోవడం చూసి కింగ్ ఫ్యాన్స్ విరాట్ కోహ్లీ రేంజ్ అన్ స్టాపబుల్ బ్రో అంటూ కాలర్ ఎగరేస్తున్నారు.

# మెస్సీ అంటే ప్రపంచానికి పిచ్చి.. అతడి ఆట కోసం వెయిటింగ్.. కోచ్ వ్యాఖ్యలు వైరల్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా ప్రపంచ కప్ లో భాగంగా ఈరోజు ( జూన్ 17న తెల్లవారుజామున, బుధవారం) రాత్రికి అల్జీరియాతో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా తమ తొలి మ్యాచ్ ఆడబోతుంది. ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సికి ఇది 200వ ఇంటర్నేషనల్ మ్యాచ్ కావడం విశేషం.. ఈ ఫిఫా ప్రపంచ కప్ మెస్సికి చివరిదంటూ వార్త కథనాలు వస్తున్నాయి. దీంతో మెస్సిని మైదానంలో చూడాలని భారీగా ఫ్యాన్స్ వెయింటింగ్ చేస్తున్నారు. కొంతకాలంగా కండరాల గాయంతో ఇబ్బంది పడుతున్న లియోనల్.. పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లు టాక్. ఇక అర్జెంటీనా ప్రధాన కోచ్ లియోనెల్ స్కలోని.. మెస్సిపై ప్రశంసలు గుప్పించాడు. ప్రపంచ మొత్తం అతడి కోసం వేచి చూస్తోందని వెల్లడించాడు.

**మెస్సి కోసం ప్రపంచం మొత్తం వెయిటింగ్:**

అర్జెంటీనా ఫ్యాన్స్ మాత్రమే కాదు.. ప్రపంచం మొత్తం లియోనల్ మెస్సిని గ్రౌండ్ లో చూడాలని ఈగర్ గా వెయిటింగ్ చేస్తుంది. అతడు కేవలం మా జట్టుకే కాదు ప్రపంచ ఫుట్‌బాల్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.. మెస్సి గురించి చెప్పడానికి ఏమీ లేదు.. అతడు ఎప్పుడూ జట్టుకు అండగా నిలిచాడు.. టీమ్ విజయాల్లో మెస్సి పాత్రే అత్యంత కీలకం అన్నాడు. మెస్సి ఫుట్‌బాల్ దేవుడు అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని స్కలోని చెప్పుకొచ్చాడు.

**మెస్సితో కలిసి ఆడటం గర్వంగా ఉంది:**

ఖతార్ వేదికగా జరిగిన ఫిఫా ప్రపంచ కప్ 2022 టైటిల్‌ను అర్జెంటీనా దక్కించుకున్న విషయం తెలిసిందే. మరోసారి టైటిల్‌ను నిలబెట్టుకోవాలనే టార్గెట్ తో బరిలోకి మెస్సి సేన దిగబోతుంది. ఈ సందర్భంగా మెస్సి సహచరుడు నికోలస్ ఒటమెండీ మాట్లాడుతూ.. ఖతార్‌లో సాధించిన గెలుపు దేశాన్ని ఒక్కటి చేసిందన్నాడు. ఆ జ్ఞాపకాలు మాకు మరింత బలాన్ని ఇస్తున్నాయి.. అదే పట్టుదలతో మళ్లీ బరిలోకి దిగబోతున్నామని వెల్లడించారు. కానీ, మెస్సితో కలిసి ఆడటం నాకు చాలా గర్వంగా అనిపిస్తుంటుంది.. అతడు అసాధారణ వ్యక్తి.. స్టేడియంలో మెస్సి ఓ యోధుడు కనిపిస్తాడని పేర్కొన్నాడు.

# శ్రేయస్‌?ను పక్కన పెట్టి సూర్యను పెట్టారేంటి.. సోనీ స్పోర్ట్స్‌పై నెటిజన్స్ ఫైర్





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత టీ20 జట్టు కెప్టెన్సీ లొల్లి ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత బీసీసీఐ ఊహించని విధంగా సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించి.. అతని ప్లేస్‌లో శ్రేయస్ అయ్యర్‌ను కొత్త కెప్టెన్‌గా ప్రకటించింది. ఈ ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్ల కోసం కొత్త టీమ్ ని ప్రకటించింది. అఫీషియల్ బ్రాడ్‌కాస్టర్ సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ చేసిన ఒక పెద్ద పొరపాటుపై ఇప్పుడు నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు.

**కొత్త కెప్టెన్‌కు నో ఛాన్స్.. పాత కెప్టెన్‌తో ప్రోమో:**

ఈరోజు (జూన్ 16, మంగళవారం) మధ్యాహ్నం 12:18 గంటలకి సోనీ స్పోర్ట్స్ ఇంగ్లాండ్ సిరీస్ కోసం భారీ హైప్ ఇచ్చేలా విడుదల చేసిన ప్రోమో వీడియోను ఎక్స్ (ఆ) లో పోస్ట్ చేసింది. గత ఏడాది ఇంగ్లాండ్‌తో జరిగిన 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ విజువల్స్‌ను వాడుకుంటూ ఈ వైట్-బాల్ సిరీస్ కోసం బిల్డప్ ఇచ్చింది. కానీ, ఇక్కడే సోనీ టీమ్ ఒక పెద్ద బ్లండర్ మిస్టేక్ చేసింది. టీమిండియా లేటెస్ట్ అప్‌డేట్స్‌ను మర్చిపోయి.. కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ విజువల్స్ పెట్టకుండా, మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను మెయిన్ ఫేస్‌గా చూపిస్తూ ప్రోమో వదిలింది.

**ప్రోమోలో లేని అయ్యర్.. మీమ్స్‌తో ఫ్యాన్స్ లొల్లి:**

ఈ వీడియో కాస్తా క్షణాల్లో సోషల్ మీడియాలో వైరల్ అయిపోయింది. దాంతో క్రికెట్ ఫ్యాన్స్ బీసీసీఐ ఏమో సూర్యను కెప్టెన్సీ నుంచి తీసేస్తే.. సోనీ స్పోర్ట్స్ ఏమో ప్రోమో నుంచి కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను తీసేసి సూర్యను తెచ్చిందంటూ మీమ్స్ వేసి జోకులు పేల్చారు. ఫ్యాన్స్ తప్పును ఎత్తిచూపడంతో అలర్ట్ అయిన సోనీ స్పోర్ట్స్.. వెంటనే ఆ ట్వీట్‌ను డిలీట్ చేసింది. ఇప్పటి వరకు కొత్త ప్రోమో అయితే రాలేదు కానీ, తప్పును సరిదిద్దుకుని త్వరలోనే కొత్తది రిలీజ్ చేయనున్నారు.

**కావాలనే శ్రేయస్‌ను పక్కన పెట్టలేదు:**

సాధారణంగా భారత్ లో జరిగే హోమ్ మ్యాచ్‌ల బ్రాడ్‌కాస్టింగ్ రైట్స్ స్టార్ స్పోర్ట్స్ (ఘ్రుతీ గాజూశీతీం) దగ్గర ఉన్నాయి. కొత్త కెప్టెన్, పంజాబ్ కింగ్స్ కెప్టెన్ అయిన శ్రేయస్ అయ్యర్ గత చాలా కాలంగా ఇండియా తరఫున టీ20 మ్యాచ్‌లు ఆడలేదు.. దాంతో సోనీ స్పోర్ట్స్ దగ్గర శ్రేయస్ బ్లూ జెర్సీలో ఉన్న విజువల్స్ ఏవీ అందుబాటులో లేవు.. అందుకే వాళ్లు సూర్యకుమార్ యాదవ్ ఫుటేజ్‌ని వాడాల్సి వచ్చింది.

**ఇంగ్లాండ్ టూర్‌కు వెళ్లే టీమిండియా:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, రవి బిష్ణోయ్, అభిషేక్ శర్మ, నితీష్ కుమార్ రెడ్డి, మహమ్మద్ సిరాజ్, సంజు శాంసన్ (వికెట్ కీపర్), అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ఇషాన్ కిషన్, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్, శివమ్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ.



# ఆ మూవీతో సమంత స్పెషల్ బాండ్.. 'అదే నా బెస్ట్'





టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత చాలా కాలం తర్వాత 'మా ఇంటి బంగారం' సినిమాతో మన ముందుకు రాబోతున్నారు. నందిని రెడ్డి దర్శకత్వంలో వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ జూన్ 19న విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్స్ లో ఫుల్ బిజీగా గడుపుతున్న సమంత.. తాజాగా పాల్గొన్న ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్, సినిమాలపై కొన్ని ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. ముఖ్యంగా తన మొదటి సినిమా 'ఏ మాయ చేసావే' పై ఆమె చూపించిన ప్రేమ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఆ వివరాలు చూద్దాం..

**ర్యాపిడ్ ఫైర్ రౌండ్‌లో సమంత ఇంట్రెస్టింగ్ ఆన్సర్స్:**

ఇక ప్రమోషన్స్ లో భాగంగా జరిగిన ఒక ఇంటర్వ్యూలో సమంతకు కొన్ని క్రేజీ ప్రశ్నలు ఎదురయ్యాయి. ర్యాపిడ్ ఫైర్ రౌండ్‌లో ఆమె నటించిన హిట్ సినిమాలలో ఒకదాన్ని ఎంచుకోమని అడిగారు. ముందుగా 'ఏ మాయ చేసావే' లేదా 'ఈగ' అని అడగగా.. సమంత ఏమాత్రం ఆలోచించకుండా 'ఏ మాయ చేసావే' వైపే మొగ్గు చూపారు. ఆ సినిమానే తనకు కెరీర్ ఇచ్చిందని, అది లేకపోతే 'ఈగ' లాంటి పెద్ద ప్రాజెక్టులు వచ్చేవి కావని క్లారిటీ ఇచ్చారు.

**'రంగస్థలం', 'ఓ బేబీ'లకే ఓటు వేసిన సామ్:**

ప్రశ్నలు కొనసాగుతూ.. 'ఓ బేబీ' లేదా 'అ ఆ' అని అడగగా ఆమె 'ఓ బేబీ'ని ఎంచుకున్నారు. అలాగే లేడీ ఓరియెంటెడ్ ఫిల్మ్ 'యశోద' లేదా 'రంగస్థలం' లలో దేన్ని ఇష్టపడతారని అడిగితే.. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన నటించిన 'రంగస్థలం' చిత్రానికే సమంత ఓటు వేశారు. ఇక వెబ్ సిరీస్ ల విషయానికి వస్తే 'సిటాడెల్' కంటే 'ది ఫ్యామిలీ మ్యాన్' వైపే మొగ్గు చూపారు.

**'ఫ్యామిలీ మ్యాన్' ని కాదని మళ్లీ 'ఏ మాయ చేసావే':**

అయితే అసలైన ట్విస్ట్ చివర్లో ఎదురైంది. సమంతకు భారీ గుర్తింపు తెచ్చిన 'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ లేదా ఆమె మొదటి చిత్రం 'ఏ మాయ చేసావే' లో ఏది బెస్ట్ అని హాస్ట్ అడిగారు. దానికి కూడా సమంత 'ఏ మాయ చేసావే' సినిమానే ఎంచుకున్నారు. "ఆ సినిమా లేకపోతే ఈ రోజు నేను ఇక్కడ ఉండేదాన్ని కాదు, అది నా జీవితాన్ని మార్చేసింది" అంటూ తన డెబ్యూ మూవీపై ఉన్న స్పెషల్ బాండ్ ను బయటపెట్టారు.

**నెట్టింట తెగ వైరల్ అవుతున్న వీడియో:**

సమంత చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. దీనికి ఒక ముఖ్యమైన కారణం కూడా ఉంది. 'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్‌కు సమంత భర్త రాజ్ నిడిమోరు దర్శకుడు కాగా.. 'ఏ మాయ చేసావే' సినిమాలో ఆమె మాజీ భర్త నాగచైతన్య హీరోగా నటించారు. అయినప్పటికీ, సమంత వ్యక్తిగత విషయాలను పక్కన పెట్టి.. తన సినీ ప్రయాణానికి పునాది వేసిన మొదటి చిత్రానికే పెద్ద పీట వేయడం నెటిజన్ల మనసులను గెలుచుకుంటోంది.. చివరగా చెప్పాలంటే, ఎంత ఎదిగినా ఒదిగి ఉండటం అంటే ఇదేనేమో. సమంత నేడు పాన్-ఇండియా స్టార్‌గా ఎంతటి గుర్తింపు తెచ్చుకున్నా.. తనను ఇండస్ట్రీకి పరిచయం చేసిన మొదటి సినిమాను, ఆ పాత్రను గుండెల్లో దాచుకుందని ఈ ఇంటర్వ్యూతో ప్రూవ్ అయింది. మరి జూన్ 19న రాబోతున్న 'మా ఇంటి బంగారం' సినిమాతో సమంత ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేయబోతుందో చూడాలి!

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com